



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 28 శనివారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 101

Navabhoomi daily fallows..





## సంస్కరణల శిల్పికి ఘన నివాళి

- సంస్కరణల శిల్పి,ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్‌కు దేశమంతటా నివాళి
- నేడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివ దేహానికి అంత్యక్రియలు
- రాజ్‌ఘాట్‌లో స్థలం కేటాయించాలని కోరిన ఏఐసీసీ చీఫ్ ఖర్గే
- నిగమ్ బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలకు స్థలం కేటాయించిన కేంద్రం
- నేటి ఉదయం 11:45కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

నిన్న అనారోగ్యంతో కన్నుమూసిన భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కు ప్రముఖులు ఇవాళ నివాళులు అర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని ఇంకా అభిమానులు, నాయకులు, ప్రముఖుల సందర్శన కోసం ఆయన నివాసంలోనే ఉంచారు. రేపు మన్మోహన్ భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో యమునా నదీ తీరంలో మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ లేఖ రాసింది. అయితే కేంద్రం మరో చోటు కేటాయించింది. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు యమునా నది తీరంలోని రాజ్ ఘాట్ వద్ద స్థలం కేటాయించాలని ప్రధాని నరేంద్ర మోడీకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లేఖ రాశారు. అలాగే ఫోన్ కూడా చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇవాళ ఉదయం తాను ప్రధాని మోడీకి ఫోన్ చేసి రేపు అంటే డిసెంబర్ 28న

## సంక్రాంతి తర్వాత ప్రక్షాళన

- మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణకు సీఎం చంద్రబాబు కసరత్తు
- కేబినెట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలన్న ఆలోచనలో సీఎం
- ఇద్దరు మంత్రులను తప్పించి,ఆ స్థానంలో నాగబాబు,పల్లాకు ఛాన్స్
- యాక్టివ్‌గా లేని ఇద్దరు మంత్రుల పనితీరుపై సీఎం గుస్సా
- మిగతా కొందరి వైఖరి మార్చుకోవాలంటూ హెచ్చరికలు

2



కర్నూలు-నవభూమిబ్యూరో

ఏపీలో కేబినెట్ ప్రక్షాళన చేయాలని సీఎం చంద్రబాబు దాదాపు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఏపీలో కేబినెట్ ప్రక్షాళన చేయాలని సీఎం చంద్రబాబు దాదాపు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఇద్దరు మంత్రులను తప్పించి.. వారి స్థానంలో మరో ఇద్దరితో పాటు.. జనసేన నాయకుడు నాగబాబుకు కూడా.. ఈ దఫా మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు. దీనికి సంబంధించి అత్యంత సన్నిహిత నాయకులతో ఆయన చర్చలు జరిపినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనికి సంక్రాంతి తర్వాత ముహూ ర్తం నిర్ణయించినట్టు సమాచారం. విరాట్ కోహ్లి వర్సెస్ కొంటాస్-ఆసీస్ మీడియా-ప్రేక్షకులు సంక్రాంతి వరకు వేచి చూడడానికి కారణం.. మంచి ముహూర్తాలు లేకపోవడంతో పాటు.. నాగబాబు కూడా.. సంక్రాంతి తర్వాతే.. మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించు కున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఇద్దరిని గట్టిగా మార్చేందుకు చంద్రబాబు నెల రోజుల కిందటే నిర్ణయించుకున్నారు. పనితీరు ఆధారంగానే కాకుండా.. వారి స్వభావం, ఇతరత్రా ఆరోపణలు వంటివాటిని పరిగణనలో కి తీసుకుంటున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఇద్దరు మంత్రులకు ఉద్వాసన పలకనున్నారు., అయితే.. ఈ ఇద్దరు మంత్రులు ఎవరు? అనేది చెప్పడం లేదు. ప్రస్తుతం ఉన్న అంచనాల మేరకు.. సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే.. ఇప్పుడు సామాజిక వర్గాల మేరకు కాకుండా.. పనితీరు, దూకుడు, తన విజన్‌కు తగినట్టు నడుచుకునే వారు ఫలితాల ఆధారంగా పనిచేసే వారు.. కావాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. ప్రస్తుతం ఉన్న వారిలో సగం మంది మాత్రమే చంద్రబాబు మనసు దోచుకుంటున్నారు. మిగిలిన వారిలో సగం మంది వెనుకబడి ఉన్నారు. మరికొందరు.. నలుగురు నుంచి ఐదుగురు వరకు.. బాగా వెనుకబడ్డారు. దీంతో వీరిలోనూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు.. పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి పెరిగిన వారిని పక్కన పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక, జనసేన నుంచి నాగబాబుకు అవకాశముంది

## కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

- కేటీఆర్‌ను ఈనెల 31 వరకు అరెస్టు చేయవద్దు
- గడువును ఒక రోజుకు అదనంగా పొడిగించిన హైకోర్టు
- ఇప్పటికే ఐఏఎస్ దానకిశోర్ వాగ్మూలాన్ని రికార్డ్ చేసిన ఏసీబీ
- త్వరలో అరవింద్‌కుమార్,బీఎల్ఎన్‌రెడ్డిలకు నోటీసులు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

హైదరాబాద్ ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా, ఈ వ్యవహారంలో కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆయనను అరెస్ట్ చేయవద్దన్న ఉత్తర్వులను డిసెంబర్ 31 వరకు పొడిగించింది. కేటీఆర్ దాఖు చేసిన క్యాష్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారించింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశం మేరకు ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దంటూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఏసీబీ కౌంటర్‌పై కేటీఆర్ తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేశారు. శుక్రవారం జరిగిన విచారణ సందర్భంగా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికౌంటర్ దాఖలు చేశారా? అని కోర్టు ప్రశ్నించింది. ఏసీబీ దాఖలు చేసిన కౌంటర్‌నే దాన కిశోర్ కౌంటర్‌గా పరిగణలోకి తీసుకోవాలా? అని

## వైసీపీకి ఝలక్!

- వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఐఏఎస్ ఇంతియాజ్ అహ్మద్
- కర్నూలు వైసీపీ ఇన్చార్జి ఇంతియాజ్ అహ్మద్ రాజీనామా
- రాజకీయాలకు దూరంగా ఉంటానన్న ఇంతియాజ్



కర్నూలు-నవభూమిబ్యూరో

జగన్ నాయకత్వంలోని వైసీపీ నుంచి మరో నేత బయటికి వచ్చారు. మాజీ ఐఏఎస్ అధికారి, కర్నూలు వైసీపీ ఇన్చార్జి ఇంతియాజ్ అహ్మద్ పార్టీకి గుడ్ బై చెప్పారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సూచన మేరకే రాజీనామా చేశానని వెల్లడించారు. ఇక మీదట సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు.

గత ఎన్నికల్లో ఇంతియాజ్ అహ్మద్ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన ఓటమిపాలయ్యారు. 2019లో వైసీపీ గెలిచాక ఇంతియాజ్ అహ్మద్ కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. పదవీ విరమణ సమయం సమీపిస్తుండడంతో, ఆయన రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శించారు. దాంతో, జగన్ ఆయనను పార్టీలోకి తీసుకోవడమే కాకుండా, కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యేను సైతం కాదని టికెట్ కేటాయించారు.

కానీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇంతియాజ్ అహ్మద్ ఓటమిపాలయ్యారు. ఈ స్థానంలో టీడీపీ నుంచి టీజీ భరత్ విజయం సాధించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంతియాజ్ అహ్మద్ పార్టీ కార్యకలాపాల్లో పెద్దగా కనిపించింది లేదు.

### తెలంగాణను వణికిస్తున్న పులులు 2

## గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి

- ఎంపీడీఓపై వైసీపీ ఎంపీపీ కుమారుడు సుదర్శన్‌రెడ్డి దాడి
- దాడి ఘటనపై డిప్యూటీ సీఎం సీరియస్
- నేడు కడపకు పవన్ ..రిమ్స్‌లో ఎంపీడీఓకు పరామర్శ

2



**కడప-నవభూమిబ్యూరో:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై జరిగిన దాడి ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ దాడి ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, ఈ దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న జవహర్ బాబుపై వైసీపీ నేత దాడి చేయడం అప్రజాస్వామిక చర్య మండిపడ్డారు. ఇటువంటి దౌర్జన్యాలకు, రౌడీ చర్యలకు కూటమి ప్రభుత్వంలో తావు లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. ఎంపీడీవోపై జరిగిన దాడి గురించి అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. దాడికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత ఎంపీడీవోకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎంపీడీవోకు, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పాలని సూచించారు. జవహర్ బాబుపై దాడి చేసినవారికి రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్లా ఏ మాత్రం గౌరవం లేదని అర్థం అవుతూందన్నారు. దాడి చేసినవారిపై కఠిన చర్యలు

## ఒక్కరి తప్పుకు టాలీవుడ్ తలవొంచింది

- ఎవరో ఒక్కరు చేసిన తప్పుకు..
- సీఎం ముందు చేతులు కట్టుకోవాల్సి వచ్చింది
- ఒక్కడి ఈగో కోసం సినీపరిశ్రమ బలి
- దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ
- సంచలన వ్యాఖ్యలు..వీడియో వైరల్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఒక్క మనిషి కోసం, ఒకే ఒక్కడి కోసం, ఒకడి ఈగో కోసం ఇంతమంది తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సంచలన కామెంట్స్ చేశారు. సినిమా ఇండస్ట్రీ పెద్దలు కొందరు గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలవడంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ భేటీపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఇంతకీ తమ్మారెడ్డి భరద్వాజ ఏమన్నారంటే.. సినిమా

## లక్ అంటే ఇతనిదే

- హైదరాబాద్ వాచ్‌మన్‌కు రూ. 2 కోట్ల లాటరీ
- 30ఏళ్లుగా లాటరీ టికెట్లు కొంటున్న రాజమల్లయ్య
- బిగ్ టికెట్ మిలియనీర్ ఎలక్ట్రానిక్ లక్కీడ్రాలో విజేతగా నిలిచిన రాజమల్లయ్య



హైదరాబాద్-నవభూమిబ్యూరో

దుబాయ్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న హైదరాబాద్ నగరానికి చెందిన వ్యక్తికి లాటరీ రూపంలో భారీ అదృష్టం వరించింది. హైదరాబాద్‌కు చెందిన 60 ఏళ్ల నాంపల్లి రాజమల్లయ్య.. దుబాయ్‌లో ఓ భవనానికి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు తరచూ లాటరీ టికెట్ కొనే అలవాటు ఉంది. ఆ అలవాటులో భాగంగానే బిట్ టికెట్ అనే లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. ఈసారి మాత్రం అతడ్ని

- 2లో





# మారిన వాతావరణం.. 20 డిగ్రీలుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్-నవభూమి:** నగరం ముసురేసింది. రోజంతా కురుస్తున్న ముసురు, చిరుజల్లులతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. దీంతో గురువారం వాతావరణం పూర్తిగా మారిపోయింది. చిరుజల్లులతో రహదారులు బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో చలితీవ్రత తగ్గి రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. వారం రోజులక్రితం 8-10 డిగ్రీలకు పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20-21 డిగ్రీలకు పెరిగాయి. వీడిన 'గోనెసంచిలో డెడ్‌బాడీ' మిస్టరీ.. భార్యే హత్య చేసిందిఈగురువారం హయత్‌నగర్‌లో 19.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా పటాన్‌చెరు, రాజేంద్రనగర్‌లో 20 డిగ్రీలు, హకీంపేటలో 19.3, బేగంపేట)లో 20.2, దుండిగల్‌లో 20.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణం కంటే పటాన్‌చెరులో 7.5 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 8.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి.రోజంతా కురిసిన ముసురు, చిరు జల్లులతో ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్ సనత్‌నగర్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్. కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, మాదాపూర్, కొండాపూర్) ప్రాంతాల్లో కురిసిన జల్లులతో ట్రాఫిక్‌జాం సమస్యలు తలెత్తి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్‌లో మరో రెండురోజుల (శుక్ర, శనివారం) పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశముంటుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



# ఇదెక్కడి మాస్ అటాక్ రా మామా.. కండోమ్‌లో పెట్రోల్ నింపి సర్పంచ్ కారులోకి విసిరి!



**తుల్జాపూర్-నవభూమి:** రాజకీయ నాయకులపై, సినిమా వాళ్లపై... శత్రువులపై ఒక్కొక్కరూ ఒక్కోలా దాడి చేస్తారు. కర్రలు, రాళ్లతో కొట్టడం, గుడ్లు, టమోటాలు విసరడం.. మరీ కోపం ఎక్కువైతే కత్తులతో నరకడం, ఉరివేసి చంపడం, బాంబులు విసరడం ఇలా ఎన్నో రకాలుగా చేస్తుంటారు పలువురు నిందితులు. కానీ మనం ఇప్పుడు మాట్లాడుకోబోయే దాడి మాత్రం అంతకు మించింది. ఓ గ్రామ సర్పంచ్‌పై పగ పట్టిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కండోమ్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్పంచ్ తీవ్రంగా గాయపడ్డాడు. కండోమ్ దాడి ఏంటబ్బా అనుకుంటున్నారా ఈ స్టోరీ మొత్తం చదివేయండి విషయం మీకే అర్థం అవుతుంది. మహారాష్ట్రలోని ధారశివ్ జిల్లామేసాయి జవల్గా గ్రామ సర్పంచ్ అయిన నామ్‌డియో నికమ్ ప్రస్తుతం పుణేలో నివాసం ఉంటున్నాడు. కానీ పనుల నిమిత్తం గ్రామానికి మూడు నాలుగు సార్లు వచ్చి వెళ్తుంటాడు. ఈక్రమంలోనే డిసెంబర్ 26వ తేదీ రోజు కూడా గ్రామానికి వస్తున్నాడు. తనకు చెందిన ఎస్‌యూవీ వాహనంలో డ్రైవర్ సహా మరో అధికారిని వెంటబెట్టుకుని బయలు దేరాడు. రాత్రి 10 గంటల సమయంలో తుల్జాపూర్‌కు చేరగానే రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు వచ్చారు.కారును అడ్డగించి మరీ వారి వెంట తెచ్చుకున్న సుత్తెతో కారు విండో పగులగొట్టారు. ఆపై కారులోకి ఓ కండోమ్‌ను విసిరారు. అయితే అందులో అప్పటికే పెట్రోల్ నింపి ఉంది. ఆపై నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయారు నిందితులు. ఈ ఘటనలో సర్పంచ్ సహా మరో అధికారి గాయపడ్డారు. మళ్లీ వచ్చి వారేమైనా చేస్తారేమోనన్న భయంతో సర్పంచ్ వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సర్పంచ్ సహా మరో అధికారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 'రంబుల్'.. పెయిన్‌ఫుల్.. స్ట్రిప్స్ ఏర్పాటుపై జనం ఆగ్రహం



**హైదరాబాద్-నవభూమి:** వాహనాల వేగాన్ని నిరోధించడానికి ఉద్దేశించిన సిల్వర్‌వైట్ స్ట్రిప్స్ (రంబుల్‌స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్స్)ను అల్వాల్(లోని అనేక ప్రాంతాల్లో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లపై ఇష్టానుసారంగా వేస్తున్నారు. దీంతో వాహనదారులు వెన్నెముక దెబ్బతిని బ్యాక్ పెయిన్‌తో బాధపడుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌జామ్‌లతో ఇబ్బందులకు గురవుతున్న రోడ్లపై రంబుల్ స్ట్రిప్స్ వేయడం సరికాదని వాహనదారులు వాపోతున్నారు.రంబుల్ స్ట్రిప్స్ వాహదారుల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో ఏర్పాటుచేశారు. అయితే పట్టణ, గ్రామీణప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఇండియన్ రోడ్డు కాంగ్రెస్(మార్గదర్శకాల ప్రకారం హైవేలు, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వాహనదారుల వేగాన్ని నియంత్రించడంలో భాగంగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి. జాతీయ రహదారులపై, రాష్ట్ర రహదారులపై నిబంధనల ప్రకారం రంబుల్ స్ట్రిప్స్‌ను వేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంటున్నారు.కానీ ఎక్కడ పడితే అక్కడ పలు రోడ్లపై ఏర్పాటు చేయడంతో వాహనదారులు, ఆటోప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్లమీద స్పీడ్‌బ్రేకర్స్ తక్కువసైజ్‌లో ఉండేవి. ప్రస్తుతం సగం అడుగు( హాఫ్ ఫీట్)ఎత్తు వరకు ఉన్నాయని వాహదారుడు సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు రంబుల్ స్ట్రిప్స్‌తో ఇబ్బందులు మరోవైపు రోడ్లపై ఉన్న గుంతలతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

మార్గదర్శకాల ప్రకారం..ఎత్తు 20 నుంచి 30 ఎంఎం(మిల్లిమీటర్), 200- 300 మిల్లిమీటర్ల వెడల్పు, ఒక మీటర్ గ్యాప్‌లో ఆరు సంఖ్యల మధ్య ఒక ప్రదేశంలో ఉండాలని మార్గదర్శకాల్లో చెబుతుండగా, రంబుల్ స్ట్రిప్స్‌ను మాత్రం ఇష్టానుసారంగా అవసరంలేని ప్రాంతాల్లో కూడా వేస్తున్నారు. దీంతో ప్రతి రోజు వాహనదారులు వెన్నునొప్పి, డిస్క్ వంటి సమస్యలతో తరుచూ బాధపడుతున్నారు. రామంతాపూర్ స్ట్రీట్‌నెంబర్-8 హబ్సిగూడ మార్గంలో ఒకే రోడ్డుపై పదుల సంఖ్యల్లో రంబుల్ స్ట్రిప్స్ వేశారు. దీంతో ముఖ్యంగా మహిళలు తీవ్రమైన బ్యాక్ పెయిన్‌తో బాధపడుతున్నారు.

అయితే పాఠశాలలు, నివాసాప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో వీటినేస్తే బాగుటుందని స్థానికులు సుధారావు సూచించాడు. ప్రజల నుంచి వసూలుచేస్తున్న పన్నులను ప్రజాల ఆరోగ్యంపై పడేవిధంగా చేయడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసే ముందు స్థానికంగా ప్రమాదాలు జరుగుతున్నాయా అని ఆలోచించి వేయాలని వాహనదారులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు.

- రాజీవ్ రహదారి, సుచిత్ర, కొంపల్లి- బొల్లారం, అల్వాల్ లయోలా కళాశాల, తదితర ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వేసిన రంబుల్ స్ట్రిప్స్ కారణంగా బయటకు వెళ్లాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు.

# ప్రజల మనోభావాలు దెబ్బతీసే వ్యాఖ్యలు సహించం..

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఆంధ్రప్రాంత వాసులపై వివాదాస్పద వ్యాఖ్య లు చేసిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వ్యాఖ్యలు గర్హనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శిక్షణ తరగతుల్లో నేర్చుకుంది ఇదేనా కనీసం ఏం మాట్లాడుతున్నాం అనే విజ్ఞత లేకపోవడం చాలా దురదృష్టం కరమన్నారు. హైదరాబాద్ మహానగరంలో సినీ పరిశ్రమ ద్వారా లక్షల మంది ఉపాధి పొందుతున్నారని అందరూ మన బిడ్డలేనని దచేసి ఆంధ్ర, తెలంగాణ భావన తేవద్దని హితవు పలికారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే భూపతిరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఫతేనగర్ డివిజన్ గౌతమ్‌నగర్‌లోని ఆల్ అన్సారి సొసైటీ ఆధ్వర్యంలో 210 గజాలలో వారిసొంత స్థలంలో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ పనులను గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు(%మీూా మీుసష్ట్రుఋఝతీుఎ ఖతీఅంష్ట్రఋఝ ాఋశీ%), కార్పొరేటర్ సతీష్ గౌడ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతే పేద ప్రజల వివాహాల కోసం కమ్యూనిటీహాల్ నిర్మించడం అభినందనీయమని కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ హాల్ నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జహీర్ సల ఉద్దీన్, అధ్యక్షుడు ఎండీగౌస్, ఉపాధ్యక్షుడు యూసఫ్, ఎండీ ఖలీల్ గోరేమియా, నిస్సార్, అహ్మద్, ఎండీ ముజీబ్, అక్రం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను వణికిస్తున్న పులులు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రాన్ని పులులు వణికిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుంచి పులులు దాడి చేస్తాయో తెలియక ప్రజలు భయంతో అల్లాడిపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇంటి నుంచి కాలు బయటకు పెట్టాలంటేనే వెనక్కి జంకుతున్నారు. తాజాగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం శివారులో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మిర్చి పంట పొలంలో పులి అడుగులు గుర్తించిన రైతులు, కూలీలు తమ పనులను ఆపేసి భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. వెంటనే గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి సంచారంపై అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే ఫారెస్ట్ అధికారులు గ్రామానికి వచ్చి పులి పాదముద్రలు సేకరించి.. పులినా కాదా నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రుద్రం గూడెం శివారులో ఈరోజు ఉదయం పులి కదలికలను రైతులు గుర్తించారు. మిర్చి తోటలో పులి పాదముద్రలను చూసిన వ్యవసాయ కూలీలు భయంతో అక్కడ నుంచి బయటకు పరుగులు తీశారు. పులి గుర్తులతో పాటు పులి గాండ్రింపు శబ్దాలు కూడా విన్నామని స్థానిక రైతులు, కూలీలు చెబుతున్నారు. పులి సంచారంతో మిర్చిని ఏరేందుకు వచ్చిన రైతులంతా పరుగులు పెట్టారు. గత రెండు వారాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పులి సంచారం కొనసాగుతోంది. గోదావరిని దాటి వచ్చి తడ్వాయి మండలం వెంకటాపురంలో పులి సంచారం కలకలం రేపుతోంది. పులిని పట్టుకునేందుకు ట్రాక్ చేస్తున్నామని అటవీ శాఖ అధికారులు చెబుతున్నపటికీ పులి వారికి చిక్కని పరిస్థితి.అయితే ఇక్కడ సంచరించిన పులి రుద్రగూడెంలో సంచరించిన పులి ఒక్కటేనా అనేది తెలియాల్సి ఉంది. అటవీ అధికారులకు రైతులు సమాచారం ఇవ్వగా మరికాసేపట్లో వారు అక్కడకు చేరుకునే అవకాశం ఉంది. అయితే ఆ పాదముద్రలు పులివా లేక మరేదైనా జంతువుదా అనే విషయాన్ని అటవీ శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది. రుద్రగూడెం గ్రామం అటవీ ప్రాంతానికి దగ్గరైనప్పటికీ అన్నీ కూడా మిర్చి తోటలు, పత్తి వ్యవసాయం చేసే పంట పొలాలు కాబట్టి ఈ ప్రాంతానికి పులి వచ్చే సూచనలు తక్కువగా ఉంటుంది.. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు నిర్ధారణ చేశాకే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే పెద్ద పెద్ద అడుగులు, పులి గాండ్రిపులు వినిపిస్తున్నాయని రైతులు తీవ్ర భయాందళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆ పరిచయమే బలితీసుకుందా?



**హైదరాబాద్-నవభూమి:**కామారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టించిన ముగ్గురి అదృశ్యం ఘటన విషాదంగా మారిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ బుధవారం అదృశ్యం కాగా, అర్ధరాత్రి సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం ఉదయం ఎస్సై సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. చెరువు వద్ద ముగ్గురి వస్తువులు లభ్యం కావడంతో గజ ఈతగాళ్లతో సుమారు 13 గంటల పాటు గాలింపు చేపట్టగా మృతదేహాలు వెలుగు చూశాయి. ఎస్సై సాయికుమార్ బుధవారం ఉదయం కారులో వెళ్లినట్లు భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలో రికార్డైంది. ఆ తర్వాత కామారెడ్డి మండలం నర్సన్నపల్లిలో శ్రుతి, నిఖిల్‌లను కారులో ఎక్కించుకొని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు ప్రాంతానికి చేరుకున్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు గుర్తించారు.సంచలనంగా మారిన ముగ్గురి మృతి వెనక ఉన్న కారణాలపై మిస్టరీ వీడలేదు. ముగ్గురూ కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారా? క్షణికావేశంలో జరిగిందా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. బలవన్మరణానికి పాల్పడేంత సమస్య ఏమై ఉంటుందనే కోణంలో పోలీసులు దృష్టి సారించారు? ముగ్గురి మధ్య ఎలాంటి పరిచయాలు కొనసాగాయి? అవి వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు ప్రమాదకరంగా పరిణమించాయా? చర్చించుకొని పరిష్కరించుకునేందుకే వారు చెరువు వద్దకు వెళ్లి ఉంటారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. చర్చలు ఫలించకపోవడంతోనే శ్రుతి చెరువులోకి దూకి ఉంటుందా? ఆమెను కాపాడే ప్రయత్నంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారా! అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఆ ముగ్గురి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు వారి కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.గంటల కొద్దీ ఫోన్లు.. ముగ్గురూ వారం రోజుల నుంచి చాలా సార్లు, గంటల కొద్ది ఫోన్లలో మాట్లాడుకున్నట్లు నిర్ధారించారు. ఆ ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాకు చెందిన ఎస్సై సాయికుమార్‌కు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. శ్రుతికి వివాహం కాగా, అయిదేళ్ల కిందటే భర్తతో మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకుందని పోలీసులు తెలిపారు. ముగ్గురు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఆ పరిచయమే ఇంతవరకు తెచ్చిందా? :** భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గతంలో బీబీపేటలో ఎస్‌హెచ్‌వోగా పని చేసినప్పుడు అక్కడ రిసెప్షనిస్టుగా పని చేస్తున్న కానిస్టేబుల్ శ్రుతితో పరిచయం ఏర్పడింది. బీబీపేటకే చెందిన నిఖిల్ కంప్యూటర్ల మరమ్మతులు చేసేవాడు. ఆ పని మీద ఠాణాకు వచ్చినప్పుడు సాయికుమార్, శ్రుతిలతో పరిచయం ఏర్పడింది. తర్వాత సాయికుమార్ భిక్కనూరుకు బదిలీ అయ్యారు. మొత్తానికి ఈ పరిచయమే వారి ప్రాణాల మీదకు తెచ్చినట్లు భావిస్తున్నారు.

# ఒక్కరి తప్పుకు టాలీవుడ్ తలవొంచింది

**(1వపేజీ తరువాయి)**టికెట్లు ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో ఏర్పడిన పరిణామాలపై దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఓ వీడియోను విడుదల చేశారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్ రెడ్డిని సినీ పెద్దలు కలవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆయన ఏమన్నారంటే..

"ఇప్పుడు సినీ ఇండస్ట్రీ అంతా వెళ్లి సీఎం ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సిన అవసరం ఏమొచ్చింది. ఒక్క మనిషి కోసం. ఆ మనిషి సొంతంగా చేశాడా? వేరేలా చేశాడా? అనేది పక్కన పెడితే.. తప్పయితే జరిగింది. ఆయన మర్డర్ చేశాడని నేను అనడం లేదు. ఆయన రోడ్ షో చేయడం కానీ, రోడ్ షోగా వెళ్లడం కానీ, ఇలా ఆయనకు తెలియకుండానే బాధ్యుడయ్యాడు. ఏదయినా కానివ్వండి.. తప్పు తప్పే. ఈ తప్పు జరిగిన తర్వాత దానిని కవర్ చేయడానికి మళ్లీ కొన్ని అబద్దాలు ఆడటంతో.. గవర్నమెంట్ కూడా దీనిని ప్రెస్టీజియస్‌గా తీసుకోవడం, అలాగే ఆయన కూడా ప్రెస్టీజియస్‌గా తీసుకోవడంతో పెద్ద వివాదంగా మారిపోయింది. ఫైనల్‌గా ఇండస్ట్రీ పెద్దలందరూ ఇవాళ సీఎం దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది. దీనిని కాంప్రమైజ్ అనాలో, లేక తలవంపులు అనాలో.. ఏమనాలో నాకు తెలియదు. ఒక్క మనిషి కోసం, ఒకే ఒక్కడి కోసం, ఒకడి ఈగో కోసం ఇంతమంది తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని తమ్మారెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు.

ఇంకా ఆయన మాట్లాడుతూ.. "సినిమా వాళ్లను ఫ్యాన్స్ దేవుళ్లుగా చూస్తారు. దానికి అనుగుణంగా హీరోలు ఎక్కడికి వెళ్లినా నాలుగు కారుల్లో వెళ్లాలి.. రోడ్ షో చేయాలని భావిస్తున్నారు. ఇలాంటివి ఈ మధ్యకాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. అలా కాకుండా సైలెంట్‌గా వెళ్లి సినిమా చూసి వచ్చేస్తే ఇలాంటి ఘటనలు జరగడానికి ఆస్కారం తక్కువ ఉంటుంది. గతంలో హీరోలు ఇలాగే చేసేవారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ వంటి అగ్ర హీరోలు అభిమానులతో సినిమాలు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వాళ్లు సైలెంట్‌గా ఏదో ఒక మల్టీప్లెక్స్‌కు వెళ్లేవారు. సినిమా చూసేవారు. బయటకు వచ్చే సమయంలో అక్కడ ఉన్నవారితో కాసేపు మాట్లాడేవారు. ఒకవేళ సింగిల్ స్క్రీన్ థియేటర్‌కు వెళ్లాల్సి వచ్చినా.. ఎవరికీ చెప్పకుండా థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి వచ్చేసేవారు. ఇప్పుడలాంటి పరిస్థితి లేదు.. సామాజిక మాధ్యమాల వల్ల ఏ హీరో ఎప్పుడు ఎక్కడ ఉంటున్నాడు అనే విషయం అభిమానులకు త్వరగా తెలిసిపోతుంది. దీంతో హీరోలను చూసేందుకు భారీ స్థాయిలోనే అభిమానులు తరలివస్తున్నారు. ఫ్యాన్స్, ప్రజా శ్రేయస్సు గురించి కూడా హీరోలు ఆలోచించాలి.." అంటూ హీరోలకు ఆయన హితబోధ చేశారు.

## భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు

# పెట్టించిన మన్మోహన్..

**న్యూఢిల్లీ-నవభూమి:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే. అతి సాధారణ కుటుంబంలో జన్మించిన మన్మోహన్.. దేశ అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. ప్రధానిగా పదేళ్లు సేవలందించారు. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకూ ప్రధానిగా పనిచేశారు. ఇక 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. మన్మోహన్ భారత ఆర్థిక విధానాలపై చెరనగి ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.

1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థిక మంత్రిని చేశారు. బ్యాంకింగ్ రంగంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టిన మన్మోహన్‌సింగ్ భుజాలపై దుర్భర స్థితిలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచే బాధ్యతను ఉంచారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి పెద్ద మార్పులు తీసుకురావడానికి మన్మోహన్‌సింగ్‌కు పీవీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అప్పటి నుంచి వారిద్దరూ కలిసి దేశ ఆర్థిక రథాన్ని పరుగులు పెట్టించారు. 1991 లో (1991 %ఖఅఐశీఅ దీబఎస్త్రవ్%) ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆయన తొలి బడ్జెట్‌ను గేమ్ ఛేంజర్ బడ్జెట్ అని పిలుస్తారు.

దిగుమతి-ఎగుమతి విధానాన్ని మార్చడం ద్వారా మన్మోహన్‌సింగ్ భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచానికి తెరిచారు. ఈ బడ్జెట్ కారణంగా, భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఊపందుకున్నది. దేశంలో ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు బ్లూప్రింట్ సిద్ధం చేయబడింది. దీనికి ముందు దేశ ఆర్థిక వ్యవస్థ అనేక కారణాల వల్ల వెనుకబడి ఉన్నది. స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, చైనా, పాకిస్తాన్‌తో యుద్ధాలు, దిగుమతుల కోసం సంక్లిష్టమైన లైసెన్సింగ్ వ్యవస్థలు, విదేశీ మూలధన పెట్టుబడులపై ప్రభుత్వ ఆంక్షలు వంటి అనేక అంశాలు ఆర్థిక వ్యవస్థ వృద్ధిని నిలిపివేశాయి.

మన్మోహన్ సింగ్ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ అనే మూడు విభాగాల్లో కీలక మార్పులు తీసుకొచ్చారు. దాంతో పాటు దిగుమతి-ఎగుమతి విధానంలో మార్పులు చేశారు. దిగుమతి లైసెన్స్ ఫీజు తగ్గించి, ఎగుమతులను ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకున్నారు. కస్టమ్ డ్యూటీ 220 శాతం నుంచి 150 శాతానికి తగ్గింది. బ్యాంకులపై ఆర్‌బీఐ నియంత్రణను తగ్గించారు. డిపాజిట్లు, రుణాలపై వడ్డీ రేటు, రుణ మొత్తాన్ని నిర్ణయించే అధికారం బ్యాంకులకు ఇచ్చారు. దేశంలో బ్యాంకుల విస్తరణకు దారితీసేలీ ప్రైవేట్ బ్యాంకులు ప్రారంభించేందుకు నిబంధనలను సడలించారు. లైసెన్స్ రాజ్‌ను రద్దు చేసింది. దాదాపు 18 పరిశ్రమలు మినహా అందరికీ లైసెన్స్ అవసరాన్ని తొలగించారు. ఈ మార్పులు అంతర్జాతీయ మార్కెట్‌తో నేరుగా భారతీయ పరిశ్రమలకు పోటీకి తలుపులు తెరిచాయి.

# సంస్కరణల శిల్పికి ఘన నివాళి

**(1వపేజీ తరువాయి)**జరిగే డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు చోటు కేటాయించాలని కోరినట్లు ఖర్గే తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశపు గొప్ప కుమారుడి స్మారకానికి ఇది పవిత్ర వేదికగా ఉంటుందని ఖర్గే ఎక్స్ లో తెలిపారు. గతంలో పలువురు మాజీ ప్రధానులు, రాజనీతిజ్ఞుల అంత్యక్రియలు రాజ్ ఘాట్ లోనే జరిగాయని, అక్కడే సంప్రదాయం ప్రకారం మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకం ఏర్పాటు కోసం స్థలం ఇవ్వాలని ప్రధాని మోడీని కాంగ్రెస్ అధ్యక్షుడు కోరారు. అయితే కేంద్రం మాత్రం నిగమ్ బోధ్ ఘాట్‌ను మన్మోహన్ అంత్యక్రియలకు కేటాయించింది. రేపు ఉదయం 11.45కు అక్కడ అధికార లాంఛనాలతో ఈ కార్యక్రమం జరుగుతుందని హోంశాఖ తెలిపింది.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

**(1వపేజీ తరువాయి)**అదనపు అడ్వకేట్ జనరల్ ను కోర్టు ప్రశ్నించింది. దీంతో కౌంటర్ పై నిర్ణయాన్ని తెలిపేందుకు అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి సమయం కోరారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దంటూ జారీ చేసిన ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరడంతో న్యాయమూర్తి అంగీకరించి 31వ తేదీ వరకు పొడిగించారు. తదుపరి విచారణను కూడా హైకోర్టు ధర్మాసనం అదే తేదీ వరకు విచారణను కూడా వాయిదా వేసింది. కాగా, కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్ పై డిసెంబర్ 20న హైకర్టులో విచారణ జరిగింది. అప్పుడు హైకోర్టు ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశించింది.

# సంక్రాంతి తర్వాత ప్రక్షాళన

**(1వపేజీ తరువాయి)**ఆయనను ముందుగానే మంత్రివర్గంలోకి తీసుకుని.. ఆరు మాసాల్లో ఎమ్మెల్సీని చేయనున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎలా చూసుకున్నా.. సంక్రాంతి తర్వాత.. కేబినెట్‌లో ప్రక్షాళన ఖాయమన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం.

# గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి

**(1వపేజీ తరువాయి)**తీసుకోవడం ద్వారా బలమైన సంకేతం ఇవ్వాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకున్న దాడిపై విచారణ చేయడంతోపాటు ఎంపీడీవో ఆరోగ్యం గురించి నివేదిక ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. మరోవైపు, శనివారం వైసీపీ నేతల దాడిలో గాయపడిన ఎంపీడీవోను పవన్ పరామర్శించనున్నారు. కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించనున్నారు పవన్ కళ్యాణ్. అధికారితోపాటు ఆయన కుటుంబానికి పవన్ కళ్యాణ్ ధైర్యం చెప్పనున్నారు. అసలేం జరిగిందంటే.. గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై వైఎస్సార్సీపీ నేత సుదర్శన్ రెడ్డి, ఆయన అనుచరులు తీవ్రంగా దాడి చేశారు. గాలివీడు ఎంపీపీ పద్మావతమ్మ కుమారుడు సుదర్శన్ రెడ్డి దాడికి పాల్పడినట్లు ఎంపీడీవో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఛాంబర్‌లో ఉన్న తన వద్దకు సుదర్శన్ రెడ్డి వచ్చి ఎంపీపీ గది తాళాలు ఇవ్వాలని అడిగారని ఎంపీడీవో జవహర్ బాబు తెలిపారు. ఎంపీపీ లేకుండా తాళాలు ఇవ్వడం కుదరదని చెప్పడంతో దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుదర్శన్, అతని అనుచరులు విచక్షణారహితంగా కొట్టారని వాపోయారు.

# లక్ అంటే ఇతనిదే

**(1వపేజీ తరువాయి)** అదృష్ట లక్ష్మి వెతుక్కుంటూ వచ్చింది. అతడు కొన్న టికెట్‌కే లాటరీ తగిలింది. ఇటీవల అనౌన్స్ చేసిన బిగ్ టికెట్ మిలియనీర్ ఎలక్ట్రానిక్ లక్కీ డ్రాలో విజేతగా నిలిచారు రాజమల్లయ్య. ఈ లాటరీ లక్కా డ్రాలో రాజమల్లయ్య ఏకంగా వన్ మిలియన్ దిర్హామ్స్ అంటే మన దేశ కరెన్సీలో 2 కోట్ల32 లక్షల 76వేల 460 రూపాయలు. దీంతో రాజమల్లయ్య ఒక్కసారిగా కోటీశ్వరుడైపోయారు. ఏకంగా రెండు కోట్ల లాటరీ తగలడంతో రాజమల్లయ్య ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గత 30 ఏళ్లుగా తాను లాటరీ టికెట్లు కొంటున్నట్లు రాజమల్లయ్య తెలిపారు. ఎట్టకేలకు తనకు ఇప్పుడు పెద్ద మొత్తంలో లాటరీ తగలడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రైజ్ మనీలో కొంత మొత్తాన్ని తాను టికెట్ కొనుగోలు చేసేందుకు సాయం చేసిన తన స్నేహితులతో పంచుకుంటానని రాజమల్లయ్య తెలిపారు. మిగితా మొత్తాన్ని తన కుటుంబ భవిష్యత్తు కోసం ఉపయోగిస్తానని రాజమల్లయ్య తెలిపారు. తాను గత మూడు దశాబ్ధాలుగా లాటరీ కొంటున్నా.. తనకు తన కుటుంబం ఎప్పుడూ అండగా నిలిచిందని చెప్పారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆస్తుల విలువ ఎంతో తెలుసా..?




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్(92) నిన్న రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. రేపు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ చాలా సాదాసీదా జీవితాన్ని గడిపారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన పదవిలో కొనసాగారు. చాలా తక్కువగా మాట్లాడుతూ.. దేశానికి ఎన్నో ఉపయుక్తమైన సేవలందించారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు.

మన్మోహన్ సింగ్ ఆస్తుల గురించి చెప్పాలంటే ఆయన ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు. రాజ్యసభలో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం.. ఢిల్లీ, చండీగఢ్‌లో ఆయనకు ఫ్లాట్ మాత్రమే ఉంది. అఫిడవిట్ ప్రకారం మన్మోహన్ సింగ్‌కు ఎలాంటి అప్పులు లేవు. డాక్టర్ మన్మోహన్ సింగ్ వినయం, పని పట్ల నిబద్ధతత చాటుకొని రాజకీయ నాయకులకు రోల్‌మోడల్‌గా నిలిచారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్న తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ప్రధానమంత్రి పదవిని వీడిన తర్వాత మన్మోహన్ సింగ్ తన భార్యతో నివసిస్తున్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్, భార్య గురుశరణ్ కౌర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మారుతీ 800 కారంటే అమితమైన ఇష్టం. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో.. ఐపీఎస్ ఆఫీసర్ అరుణ్ అసిమ్.. మన్మోహన్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ చీఫ్‌గా చేశారు. మన్మోహన్ మారుతీ 800 కారును చాలా ఇష్టపడేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూపీలోని కన్నౌజ్ సర్దార్ నుంచి అసిమ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మన్మోహన్ చాలా సింపుల్‌గా ఉండేవారన్నారు. ఆయనకు ఒకే ఒక్క స్వంత కారు ఉండేదని, అది మారుతీ 800 కారు అని తెలిపారు. ప్రధాని ఇంటి వద్ద .. బీఎండబ్ల్యూ బుల్లెట్ ప్రూఫ్ కారుకు సమీపంలోనే ఆ మారుతీ కారు పార్క్ అయి ఉండేది. ఇది నా కారు, నా స్వంత కారు అని మన్మోహన్ ఎప్పుడూ చెప్పేవారని అసిమ్ గుర్తు చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శనివారం
28 ; డిసెంబర్ ; 2024



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు



**న్యూఢిల్లీ-నవభూమి:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు దర్శించుకున్నారు. తన భర్త వెంకట దత్తసాయి , ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సింధు దంపతులకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సింధు దంపతులు స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.కాగా, పీవీ సింధు - వెంకట దత్తసాయి వివాహం ఈనెల 22న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఓ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించిన ఒక దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ జంట ఒక్కటైంది. ఇక పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా సింధు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగింది. పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ హఫీజ్ అబ్దుల్ రెహమాన్ మక్కి మరణించారు. అతడు ముంబై ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి హఫీజ్ సయీద్ బావమరిది. అతడు గత కొంత కాలంగా వ ు ద,ు వే ు వ ా ం తో బాధపడుతున్నాడు. ఇవాళ ఉదయం గుండెపోటుతో లాహోర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.16 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ 26/11 ముంబై ఉగ్ర దాడులకు మక్కి ఆర్థిక సాయం అందించారు.మే 2019లో మక్కిని పాకిస్థాన్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. లాహోర్‌లో గృహనిర్బంధంలో ఉంచింది. 2020లో టెర్రర్ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన కేసుల్లో పాకిస్థాన్ కోర్టు అతడిని దోషిగా తేల్చింది. ఈ మేరకు జీవిత ఖైదు విధించింది. ఇక గతేడాది (2023) జనవరిలో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా మక్కిని గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించింది. ముంబై ఉగ్రదాడితోపాటు మక్కికి ఎర్రకోట దాడిలో ప్రమేయం ఉంది. దీంతో అతడిని భద్రతా సంస్థలు భారతదేశంలో వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ప్రకటించాయి. 2000 సంవత్సరం డిసెంబర్ 22న ఢిల్లీ ఎర్రకోటపై లష్కరే తోయిబాకు చెందిన ఆరుగురు ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే.

## రైతు సమస్యలపై చర్చించేందుకు సమయమివ్వండి



**న్యూఢిల్లీ-నవభూమి:** డిమాండ్ల సాధనకు రైతుల ఆందోళన, రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న క్రమంలో వారి సమస్యలపై చర్చించేందుకు తమకు సమయమివ్వాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసింది.కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం రైతులు ఆందోళన చేస్తున్నారని, డల్లేవాల్ ఆమరణ దీక్ష చేస్తున్నారని తెలిపింది. దేశవ్యాప్తంగా 500 జిల్లాలకు చెందిన రైతులు ఇప్పటికే రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాలు సమర్పించారని, రైతు సమస్యలపై చర్చించేందుకు సమయం కేటాయించాలని ఎస్‌కేఎం విజ్ఞప్తి చేసింది.

## ఎమ్మెల్యేపై దాడితో.. ఎమ్మెల్సీ సీటీ రవికి భద్రత పెంపు




**బెంగళూరు -నవభూమి:** బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై కోడిగుడ్లతో దాడి చేసిన సంఘటన నేపథ్యంలో ఎమ్మెల్సీ సీటీ రవికి భద్రత పెంచారు. వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరుగా మారుతు న్నాయి. దీంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. విధానపరిషత్‌లోనే ఎమ్మెల్సీ సీటీ రవిపై దాడి సంఘటన మరువకముందే ఎమ్మెల్యే మునిరత్న(పై దాడి సంఘటనతో పోలీసుశాఖ అప్రమత్తమైంది.సీటీ రవి(ఏఇకి భద్రత పెంచారు. ఆయన వెంట ఒక ఎస్కార్ట్ వాహనం సమకూర్చారు. కాగా బీజేపీ ప్రజాప్రతినిధులు సీటీ రవి, మునిరత్నలపై దాడికి రాష్ట్రంలో కాంగ్రెస్( గూండాయిజంకు నిదర్శనమని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గూండా పాలన సాగుతోందన్నారు. దాడులను తాము తీవ్రంగా పరిగణిస్తామన్నారు.

## డ్రైవర్ రహిత మెట్రోరైల్ ట్రయల్ రన్



**చెన్నై- నవభూమి:** డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ ప్రారంభమైంది. త్వరలో ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో విడత ప్రాజెక్టులో డ్రైవర్ రహిత మెట్రోరైళ్లు నడపాలని నిర్ణయించింది. అందుకోసం తలా 3 బోగీలతో కూడిన 70 మెట్రోరైళ్లను తయారుచేయాలని నిర్ణయించింది. 'బీఈఎంఎల్' సంస్థతో రూ.3,657.53 కోట్లకు మెట్రోరైళ్లు కొనుగోలు చేసేలా సీఎంఆర్ఎల్ ఒప్పందం చేసుకుంది.డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల ట్రయల్ రన్‌ను సీఎంఆర్ఎల్ ప్రారంభించింది. అందుకోసం ఒక రైలు, మూడు బోగీలనును గత అక్టోబరు నెలలో పూందమల్లి డిపోకు వేర్వేరుగా తరలించారు. 118.9 కి.మీ రెండవ విడత మెట్రోరైలు ప్రాజెక్టులో పూందమల్లి-పోరూర్ మధ్య నాలుగవ రైలు మార్గం ఏర్పాటవుతోంది. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ... డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయన్ రన్ ప్రారంభించామన్నారు.గంటకు 10 కి.మీ నుంచి 40 కి.మీ వేగంతో తొలివిడత ట్రయల్ రన్ జరుగుతుందని తెలిపారు. అలాగే, పూందమల్లి-పోరూర్ మధ్య గంటకు 40 కి.మీ నుంచి 80 కి.మీ వేగంతో రెండవ విడత ట్రయల్ రన్ నిర్వహించనున్నామన్నారు. బ్రేకింగ్ సిస్టమ్ పూర్తిగా పరిశోధించిన అనంతరం, 2025 డిసెంబరులో పూందమల్లి-పోరూర్ మధ్య ఈ రైళు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

## 'జిల్లు' మంటున్న ఊటీ..




**చెన్నై- నవభూమి:** : నీలగిరి జిల్లాలో ప్రతి ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు నీటి మంచు కనిపిస్తుంది. నవంబరు రెండో వారం నుంచి చలికాలం ప్రారంభమవుతుంటుంది. ఈ ఏడాది కొన్ని నెలలుగా అప్పుడప్పుడూ భారీ వర్షాలు కురుస్తుండడంతో, కొద్దిరోజులుగా ఎండ తీవ్రత కూడా నెలకొంది. గత వారం నుంచి ఊటీలో మంచు కురవడం ప్రారంభమైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలు నమోదయ్యాయి. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన మంచు కురిసింది. శివారు ప్రాంతాలైన కాంతల్, కలైకుంద, హెచ్‌పీఎఫ్, షూటింగ్ స్పాట్ తదితర ప్రాంతాల్లో మంచుతో ఎదురుగా వచ్చే వారు కూడా కనిపించని స్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో, ఊటీలో గరిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలు, శివారు ప్రాంతాల్లో 1 డిగ్రీ సెల్సియస్?గా నమోదైంది. మంచు కారణంగా ఉదయం చలి తీవ్రత కూడా ఉంది. ఉదయం తేయాకు, కొండల్లోని కాయగూరల తోటలకు వెళ్లేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో, ఊటీ బొటానికల్ గార్డెన్‌లో పూల మొక్కలు దెబ్బతినకుండా పార్క్ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

## అన్నా వర్సిటీ ఘటనను నిరసిస్తూ కొరడాతో కొట్టుకున్న అన్నామలై..



**:న్యూఢిల్లీ-నవభూమి:** అన్నా యూనివర్సిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగికదాడి ఘటనను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనకు నిరసనగా ఆయన అంతకుముందే చేసిన వాగ్దానం ప్రకారం ఇవాళ కోయంబత్తూరులోని తన ఇంటి ముందు కొరడాతో ఆరు దెబ్బలు కొట్టుకున్నారు. అంతేగాక ఇవాళ్టి నుంచి 48 రోజులపాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు.డీఎంకే పాలనలో రాష్ట్రంలో అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదని అన్నామలై ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయాలను నిరసిస్తూ తమను తాము కొరడాలతో కొట్టుకోవడం, తమను తాము శిక్షించుకోవడం అనేది తమిళనాడు సంస్కృతిలో భాగంగా ఉన్నదని ఆయన అన్నారు. పూర్వకాలం నుంచి ఉన్న సంప్రదాయాన్నే తాను ఇప్పుడు పాటించానని చెప్పారు. తన నిరసన ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదని చెప్పారు.రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నానని అన్నామలై వెల్లడించారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఘటన అలాంటి అన్యాయాల్లో ఒకటని చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్యులకు వ్యతిరేకంగా అన్యాయాలు జరుగుతూనే ఉన్నాయని అన్నామలై తెలిపారు. మహిళలు, పిల్లలు అన్యాయాలకు గురవుతున్నారని చెప్పారు.రాష్ట్రంలో అవినీతి కూడా పెరిగిపోయిందని అన్నామలై విమర్శించారు. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం గద్దెదిగే వరకు తాను కాళ్లకు చెప్పులు కూడా వేసుకోబోనని ఆయన శపథం చేశారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు.. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి దిగిన ఫొటోలను అన్నామలై గురువారం మీడియాకు వెల్లడించారు.ఆ సందర్భంగానే ఆయన రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం కొరడాతో ఆరుదెబ్బలు కొట్టుకుంటానని, ఆ రోజు నుంచి 48 రోజులపాటు నిరాహార దీక్ష చేస్తానని, డీఎంకే అవినీతి పాలన ముగిసిపోయే వరకు తాను కాళ్లకు చెప్పులు వేసుకోబోనని అన్నామలై ప్రకటించారు. ఆ ప్రకారమే ఇవాళ ఆయన కొరడాతో కొట్టుకున్నారు.

## మరణిస్తూ... ఆరుగురికి పునర్జన్మ




**చెన్నై- నవభూమి:** బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవదానంలో ఆరుగురు పునర్జన్మ పొందారు. రామనాథపురం జిల్లా కడలాడి ప్రాంతానికి చెందిన సంజయ్ (22) ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 22న కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేసేందుకు మదురైలోని షోరూమ్‌కు వెళ్లాడు. టెస్ట్ డ్రైవ్ చేసేందుకు హెల్మెట్ సరిగా పెట్టుకోకుండా సంజయ్ వెళ్లినట్లు సమాచారం. వాహనంపై వెళ్తున్న సమయలో హఠాత్తుగా కింద పడిన సంజయ్ తలకు బలమైన గాయాలయ్యాయి.అతడిని వెంటనే మదురై మీనాక్షి మిషన్ ఆస్పత్రికి తరలించగా, ఈ నెల 24వ తేది రాత్రి బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనలతో సంజయ్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. అవయవదానం చేసిన సంజయ్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆస్తుల విలువ ఎంతో తెలుసా..?



న్యూఢిల్లీ : భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్(92) నిన్న రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. రేపు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ చాలా సాదాసీదా జీవితాన్ని గడిపారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన పదవిలో కొనసాగారు. చాలా తక్కువగా మాట్లాడుతూ.. దేశానికి ఎన్నో ఉ వ య ు ు క్తు వై ు న సేవలందించారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు.మన్మోహన్ సింగ్ ఆస్తుల గురించి చెప్పాలంటే%ా% ఆయన ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు. రాజ్యసభలో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం.. ఢిల్లీ, చండీగఢ్‌లో ఆయనకు ఫ్లాట్ మాత్రమే ఉంది. అఫిడవిట్ ప్రకారం మన్మోహన్ సింగ్‌కు ఎలాంటి అప్పులు లేవు. డాక్టర్ మన్మోహన్ సింగ్ వినయం, పని పట్ల నిబద్ధతత చాటుకొని రాజకీయ నాయకులకు రోల్‌మోడల్‌గా నిలించారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్న తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ప్రధానమంత్రి పదవిని వీడిన తర్వాత మన్మోహన్ సింగ్ తన భార్యతో నివసిస్తున్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్, భార్య గురుశరణ్ కౌర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## బుల్లెట్ ఏనుగుకు మత్తు ఇంజక్షన్..



**చెన్నై- నవభూమి:** నీలగిరి( జిల్లా పందలూరు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న 'బుల్లెట్' అనే ఏనుగు(ను మత్తు ఇంజక్షన్ వినియోగించి బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తు న్నారు. నీలగిరి జిల్లా పందలూరు పరిసర ప్రాంతాల్లో 35 ఏనుగుల గుంపు మకాం వేసింది. వాటిలో బుల్లెట్ అనే ఏనుగు జనావాస ప్రాంతాల్లో ప్రవేశించి, ఇళ్లు, దుకాణాల్లో ఉన్న బియ్యం సహా ఆహార పదార్థాలు తీసుకెళ్తోంది.రెండు నెలలుగా ఇళ్లను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై కూడా ఏనుగు దాడిచేసిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గత వారం 40 ఇళ్లను ధ్వంసం చేసిన నేపథ్యంలో, అటవీ శాఖ అధికారులు గుంకీ ఏనుగు(%ను రప్పించి దాని సాయంతో బుల్లెట్ ఏనుగును అడవిలోకి పంపే ప్రయత్నాలు చేపట్టారు. ఇంతలో గురువారం వేకువజామున 2 గంటలకు టాన్‌టీ క్వార్టర్స్‌లో ప్రవేశించిన ఏనుగు, తవమణి, జ్ఞానశేఖర్‌కు చెందిన ఇళ్లను ధ్వంసం చేసింది.ఇంట్లో ఉన్న వారు వెనుక తలుపు మార్గంగా బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ నేపథ్యంలో, బుల్లెట్ ఏనుగుకు మత్తు ఇంజక్షన్ వేయాలని అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఏనుగు సామియార్‌మలై ప్రాంతంలో ఉందని, దానిని బయటకు తీసుకొచ్చే చర్యలు చేపట్టినట్లు రేంజర్ వెంకటేష్ ప్రభు తెలిపారు.

## మారుతీ 800 కారంటే మన్మోహన్‌కు ఇష్టం !



**న్యూఢిల్లీ-నవభూమి:**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు .. మారుతీ 800 కారంటే అమితమైన ఇష్టం. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో.. ఐపీఎస్ ఆఫీసర్ అరుణ్ అసిమ్.. మన్మోహన్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ చీఫ్‌గా చేశారు. మన్మోహన్ మారుతీ 800 కారును చాలా ఇష్టపడేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూపీలోని కన్నౌజ్ సర్దార్ నుంచి అసిమ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మన్మోహన్ చాలా సింపుల్‌గా ఉండేవారన్నారు. ఆయనకు ఒకే ఒక్క స్వంత కారు ఉండేదని, అది మారుతీ 800 కారు అని తెలిపారు. ప్రధాని ఇంటి వద్ద .. బీఎండబ్ల్యూ బుల్లెట్ ప్రూఫ్ కారుకు సమీపంలోనే ఆ మారుతీ కారు పార్క్ అయి ఉండేది. ఇది నా కారు, నా స్వంత కారు అని మన్మోహన్ ఎప్పుడూ చెప్పేవారని అసిమ్ గుర్తు చేశారు.2004 నుంచి 2007 మధ్య కాలంలో ఎస్పీజీ ప్రొటెక్షన్ టీమ్‌లో అరున్ చేశారు. అయితే మధ్యతరగతి కుటుంబానికి చెందిన మన్మోహన్.. ఆయన తన మూలాలను మరిచేవారు కాదన్నారు. బీఎండబ్ల్యూ ఉన్నా.. ఆయన తన మారుతీ కారుకే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. సాధారణ ప్రజల గురించి మన్మోహన్ ఎప్పుడు ఆలోచించేవారని అరుణ్ తెలిపారు. బీఎండబ్ల్యూ కారు లగ్జరీ కోసం కాదు, సెక్యూర్టీ కోసం అని మన్మోహన్‌కు చెప్పేవాడినన అసిమ్ తెలిపారు. అయితే ఆ సమయంలో.. ఖరీదైన కారు ప్రధానికి చెందుతుందని, కానీ మారుతి కారు మాత్రం తనదే అని చెప్పేవారని గుర్తు చేశారు.మన్మోహన్ సింగ్ గురువారం ఢిల్లీలో మరణించారు. ఆయనకు రేపు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇవాళ ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు ఆయన మృతికి నివాళి అర్పించారు.

# జాక్ పాట్ కొట్టిన ట్రాఫిక్ పోలీసులు




**పాట్నా-నవభూమి:** బిహార్ రాజధాని పాట్నాలో రూల్స్ అతిక్రమించిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. పాట్నా నగరంలో క్రిస్మన్ పండగ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆ క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు భారీగా చలాన్లు విధించారు. వాహనాల నేమ్ ప్లేట్‌పై బిహార్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అని రాసి ఉన్న అనధికార వాహనాలతోపాటు అనుమతి లేకుండా మెటాలిక్ నెంబర్ ప్లేట్లు వినియోగిస్తున్నవాహనాలకు భారీగా జరిమానా విధించారు.తద్వారా ప్రభుత్వానికి రూ. 28 లక్షల ఆదాయం సమకూరింది. ఈ తనిఖీలు కేవలం పాట్నా నగరంలోని మెరైని డ్రైవ్, బయిలే రోడ్డు, జేపీ గంగా పాత్ ప్రాంతాల్లో మాత్రమే చేపట్టామని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. అయితే ఈ ప్రత్యేక తనిఖీలు ఇంకా కొనసాగుతాయని స్పష్టం చేశారు. నగరంలోని ఇతర పాంత్రాల్లో సైతం ఈ తనిఖీలను విస్తరిస్తామన్నారు. జస్ట్ 50 కార్లను మాత్రమే తనిఖీ చేశామని వివరించారు. అయితే ఈ కార్లకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, గవర్నమెంట్ ఆఫ్ బిహార్, బిహార్ పోలీస్ అని నెంబర్ ప్లేట్ల మీద రాసి ఉందని తెలిపారు. ఇక ఈ ప్రత్యేక తనిఖీల్లో ఎర్ర బుగ్గ లైట్లు, ప్రభుత్వ నేమ్ ప్లేట్ల ఉన్న వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతోన్న ఆరుగురు వ్యక్తులపై కేసులు సైతం నమోదు చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు గుర్తు చేశారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో వీఐపీ సంస్కృతి నెలకొంది. వీఐపీలు ప్రయాణిస్తున్నారంటే.. పోలీసులు సైతం ట్రాఫిక్‌ను వెంటనే నియంత్రించి వారి.. వాహనాలను పంపిస్తారు. అలాగే ప్రభుత్వ వాహనం అంటే.. ట్రాఫిక్ పోలీసులు సైతం చలానాలు రాయరు. ఈ విషయాన్ని గ్రహించిన బిహార్ రాజధాని పాట్నా వాసులు తమ వాహనాలకు ఎర్ర బుగ్గలను సైతం అమర్చారు.అలాగే కారు విండో గ్లాసులకు నలుపు రంగు కవర్ అమరుస్తున్నారు. అదే విధంగా వాహనాల నెంబర్ ప్లేట్ల మీద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, గవర్నమెంట్ ఆఫ్ బిహార్, బిహార్ పోలీస్ అని రాసి ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ పేరుతో ఈ తనిఖీలు చేపట్టాలని బిహార్ పోలీసులు నిర్ణయించారు. అందులోభాగంగా క్రిస్మస్ పండగ వేళ.. ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఆ క్రమంలో 50 వాహనాలు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి.. తిరుగుతున్నట్లు గుర్తించి.. వాటికి భారీగా చలాన్లు పోలీసులు విధించారు.

దీంతో ప్రభుత్వానికి రూ. 28 లక్షల ఆదాయం సకూరినట్లు అయింది. ఇక పాట్నా నగరం మొత్తం ఈ తరహా తనిఖీలు నిర్వహిస్తే మరింత మంది వాహనదారులు.. ట్రాఫిక్స్ రూల్స్ అతిక్రమించిన విషయం బహిర్గతమవుతోందనే వాదన వినిపిస్తోంది. అదే విధంగా బిహార్ రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా తనిఖీలు చేపడితే.. మాత్రం పరిస్థితి మరోలా ఉండే అవకాశముందని ఓ చర్చ సైతం ఆ బిహార్ ప్రజల్లో కొనసాగుతోంది.



## మళ్లీ అధికారమే లక్ష్యం.. 200కు పైగా స్థానాల్లో విజయం



చెన్నై-నవభూమి: రాష్ట్రంలో వామపక్షాలతో పొత్తుపెట్టుకుని ఏడేళ్లుదాటినా తమ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతోందని కామ్రేడ్ నల్లకన్నులాంటి కమ్యూనిస్టు దిగ్గజాలు తనకు అండగా ఉన్నందున రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ధీమా వ్యక్తం చేశారు. టి.నగర్ బాలన్‌ఇల్లమ్‌లోని సీపీఐ కమిటీ కార్యాలయంలో గురువారం సీనియర్ కమ్యూనిస్టునేత ఇరా నల్లకన్ను శతవసంత వేడుకల్లో పాల్గొని ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో స్టాలిన్ మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత నల్లకన్ను వందో జన్మదిన వేడుకల్లో పాల్గొనటం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. వయోవృద్ధులైన నల్లకన్నుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాలేదని, ఆయన ఆశీస్సులు పొందేదుకే వచ్చానని చెప్పారు. నల్లకన్ను జన్మదినవేడుకలను పళయ నెడుమారన్ నాయకత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న కలైవానర్ అరంగంలో నిర్వహించనుందని, ఆ వేడుకల్లో రాష్ట్రంలోని రాజకీయ నేతలందరూ పాల్గొనేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా సభలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని తెలిపారు.

## జమిలి'తో అధికారాల ఏకీకరణ

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో జమిలి ఎన్నికలకు రంగాన్ని సిద్ధం చేయడానికి మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టింది. ఇవి ఆమోదం పొందితే పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. సహజంగానే ఈ అంశంపై కూడా అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం వాదోపవాదాలు చేస్తున్నాయి. అయితే సాధారణ ప్రజల స్పందన భిన్నంగా ఉంది. ప్రజాస్వామ్య సూత్రాలు, విలువలు, వాటి స్ఫూర్తి, ఆచరణ ప్రాధాన్యతను కోల్పోయి కేవలం మనీ, మీడియా, మూక బలాలు ప్రాబల్యం వహిస్తూ, మొత్తం ఎన్నికల ప్రక్రియే ఒక ప్రహసనంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ఎన్నికలు ఏ రూపంలో జరిగినా ఏం ఫాయిదా? అనే ప్రతిస్పందన వినిపిస్తుంది. అసలు జమిలి అంశం నేడు ఎందుకు ముందుకు వస్తోంది? దీని వెనుకనున్న అసలు ఉద్దేశ్యాలేమిటి? వంటి ముఖ్య ప్రశ్నలు వేయడం చాలా అవసరం.జమిలి ఎన్నికలకు అనుకూలంగా మూడు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పలుమార్లు జరిగే ఎన్నికల వలన అధిక ఆర్థిక వ్యయం అవుతోందని, జమిలితో గణనీయంగా ఎన్నికల ఖర్చును తగ్గించవచ్చునని, దేశ జీడీపీలో అదనంగా 10 శాతం వృద్ధి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ వీరు ఈ వాదనకు తగిన పరిశోధనలనుగానీ, సముచిత డాటా ఆధారిత రుజువులనుగానీ చూపించలేదు. కేవలం సాధారణ తర్కాన్ని ఉపయోగించడం, కొన్ని దేశాల ఎన్నికలను ఉదహరించడం జరిగింది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు అయ్యే ప్రభుత్వ ఖర్చుకంటే బడా పార్టీలు ఓటర్లకు ఎర వేయడానికి అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేసే వేల కోట్ల రూపాయల అక్రమ ధనాన్ని అరికట్టే చర్యలు చేపడితే అందరూ హర్షిస్తారు. అలాగే ఎక్కువసార్లు ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించే సందర్భాలలో అమలుచేసే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఎంసీసీ) వలన ప్రభుత్వ పాలనకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అనేక ఆటంకాలు వస్తున్నాయని కూడా చెప్పడం జరుగుతోంది. అయితే వాస్తవం ఏమిటి? ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించిన తరువాత ఓటర్లను ప్రలోభపెట్టే కొత్త పథకాలు, ప్రాజెక్టుల ప్రకటనలను మాత్రమే ఎంసీసీ నిషేధిస్తుంది. అంతేకాని అప్పటికే అమలులోనున్న వాటిపై ఎలాంటి పరిమితులను విధించదు. ఇక ఎన్నికల సందర్భంగా చేపట్టే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు లేదా సైనిక దళాలను నియమించడం తదితర విషయాలలో ఒకేసారి జరిగినా, ఎక్కువసార్లు జరిగినా పెద్ద మార్పేమీ ఉండదు.

ఇవన్నీ ప్రజలను ఒప్పించడానికి పైకి చెబుతున్న వాదనలు. వీటి సత్యాసత్యాలను అటుంచి, మనదేశ సామాజిక వ్యవస్థ నిర్మాణంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని, ప్రాంతీయ వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. అది జాతీయ పెట్టుబడి ఆధిపత్యానికి, ప్రాంతీయ పెట్టుబడి ఆకాంక్షలకు మధ్యనున్న వైరుధ్యం. దీని రాజకీయ వ్యక్తీకరణే జాతీయ స్థాయిలోని పార్టీలకు ప్రాంతీయ పార్టీలకు మధ్య పోటీలు, ఘర్షణలు, బేరసారాలు, లొంగుబాట్లు, కాళ్ళబేరాలు. ఈ వైరుధ్యం మన దేశ ఆర్థిక అభివృద్ధిలో, రాజకీయ పరిణామంలో వివిధ దశలగుండా పయనిస్తూ వస్తోంది. మొదట స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రాంతీయ పెట్టుబడి ఒక శక్తిగా రూపొందని కాలంలో జాతీయ పెట్టుబడి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఏకఛత్రాధిపత్యం వహించింది. అనంతర కాలంలో ముఖ్యంగా 1970 దశకం పూర్వార్ధం నుంచి ప్రాంతీయ పెట్టుబడుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు రాజకీయ రంగంలో ఆవిర్భవించి, రాష్ట్రాల ఎన్నికల పోటీలో గెలిచి అధికారాన్ని చేపట్టాయి. అప్పటి నుంచి ఈ వైరుధ్యం తీవ్ర రూపం దాల్చడం కనిపిస్తుంది. అప్పటికి జాతీయంగానూ, దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ అపఖ్యాతిపాలు కాగా, దానికి ప్రత్యామ్నాయంగా అదే జాతీయ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే మరొక జాతీయ పార్టీ ఆవిర్భావానికి జనతా పార్టీ రూపంలో చేసిన ప్రయోగం కూడా ఆ వైరుధ్యాన్ని టాకిల్ చేసే క్రమంలో జరిగింది. దీని ద్వారా అమెరికా, ఇంగ్లండ్‌ల తరహాలో ద్విపార్టీ పాలనను ప్రతిష్ఠించే ప్రయత్నం ప్రారంభమైంది. అంటే ఒక జాతీయ పార్టీ ప్రజల్లో పరపతిని కోల్పోయినప్పుడు మరొక జాతీయ పార్టీని ఛాంపియన్‌గా ఆకాశానికెత్తి అధికారంలోకి తేవడం.తదనంతర కాలంలో 'కోయిలేషన్ పాలిటిక్స్' అనే ఒక కొత్త దశ అవతరించింది. ప్రపంచ పరిణామాలలో వచ్చిన పెను మార్పులలో భాగంగా 90లలో ప్రారంభమైన పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాల నిరాటంక అమలుకు ఈ కోయిలేషన్ పాలిటిక్స్‌లోని పరస్పర ఒత్తిళ్ళు, అధికార పెనుగులాటలు అవరోధాలుగా పరిణమించాయి. ప్రభుత్వాలు ఏర్పడడం, కూలిపోవడం, మధ్యంతర ఎన్నికలు రావడం వలన జాతీయ పెట్టుబడి, ప్రాంతీయ పెట్టుబడి రెండింటికీ అనేక చికాకులను తెచ్చి పెట్టాయి. ఎందుకంటే అప్పటికి ప్రాంతీయ పెట్టుబడికి చెందిన కొన్ని శక్తులు జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థలతో జతకట్టి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోని కొన్ని రంగాలలో పాత్రను పోషించే స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచీకరణను నిర్దేశించే ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి'సంస్కరణల' అమలు సజావుగా, శీఘ్రంగా, వేగంగా ముందుకు సాగాలంటే ఎన్నికల్లో ఒకే పార్టీకి సంపూర్ణ ఆధిక్యం ఉండాలనే అభిప్రాయాన్ని ఒక పథకం ప్రకారం కూడగట్టడం జరిగింది. ఇదే ధోరణిని 2014, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రతింబించాయి.

ఈ పదేళ్ళ కాలంలో రాజ్యం పాలనాంగాలు గుత్త పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చడమే ఏకైక ధ్యేయంగా పనిచేయడం కనిపిస్తుంది. ఈ క్రమంలో జాతీయ%-%ప్రాంతీయ పెట్టుబడుల మధ్య వైరుధ్యాన్ని నయానో, భయానో అణగదొక్కి, పూర్తిగా జాతీయ గుత్త పెట్టుబడికి, ప్రాంతీయ పెట్టుబడి పూర్తిగా లోబడిపోయి, దాసోహం అయ్యేలా చేసే చర్యలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 'ఒకే దేశం%-%ఒకే పన్ను' నినాదంతో జీఎస్టీని తీసుకువచ్చి ఆర్థిక కేంద్రీకరణను మరింతగా పెంచింది. ఆదాయ రాబడులకై రాష్ట్రాలు కేంద్రంపై ఎక్కువగా ఆధారపడే విధంగా చేసింది. ప్రస్తుతం ఒకవైపు రెండు ప్రధాన పార్టీల మధ్య పోలరైజేషన్ చేసే ద్విపార్టీ రాజకీయ ప్రయోగాన్ని సజీవంగా ఉంచుతూనే, మరోవైపు ఏక పార్టీ స్వైర విహారానికి పావులు కదపడం కూడా జాతీయ గుత్త పెట్టుబడి ముందు ఒక ముఖ్య ఎజెండాగా ఉంది. అందుకుగాను 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో రాజకీయ అధికారం యావత్తు ఏకీకరణ, కేంద్రీకరణ చేయడం అత్యంత అవసరం. గుత్త పెట్టుబడి ప్రయోజనాలను మరింతగా నెరవేర్చే ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణ విధానం యెడల బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య పెద్ద విబేధమేమీ లేదు. అందుకే చాలా నేర్పుగా జమిలి బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు.

# అవిశ్రాంత యోధుడు మన్మోహన్



అతి సాధారణ ఆహార్యం. ఎంత సాధారణంగా ఉంటారో అంతటి మౌనంగానే ఉంటారాయన. కానీ విధాన నిర్ణయాల్లో మాత్రం దూకుడు ప్రదర్శిస్తుంటారు. 2004లో దేశ 13వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మన్మోహన్ సింగ్ 2014 వరకూ కొనసాగారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని గట్టెక్కించి అభివృద్ధిపథంలో పరుగులు పెట్టేలా చేసి ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ప్రసిద్ధిగాంచారు.

**ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ!**

పార్లమెంటు సభ్యుడిగా దాదాపు 33 ఏళ్ల పాటు కొనసాగారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ కీలక సమయాల్లో ఓపిగ్గా సభకు వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి, ప్రజా జీవితం నుంచి నిశ్శబ్దంగానే వైదొలగినప్పటికీ దేశ ఆర్థిక రంగానికి వేసిన బలమైన పునాదులు ఆయనను ఎన్నటికీ గుర్తు చేస్తూనే ఉంటాయి. ఆర్థిక మంత్రిగా ఎల్‌పీజీ సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది.

2004లో కాంగ్రెస్ విజయం సాధించాక ప్రధాని అభ్యర్థిపై అనేక ఊహాగానాలొచ్చాయి. అయితే అనూహ్యంగా మన్మోహన్‌ను సోనియా గాంధీ ఎంపిక చేశారు. దీంతో ఆయన మే 22వ తేదీన యూపీఏ తరఫున ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టాక మన్మోహన్ జీవితం మరో మలుపు తిరిగింది. దేశాన్ని సంస్కరణల పథంలో పరుగెత్తించాలనే ఉద్దేశంతో పీవీ ఆయనను కేంద్ర ఆర్థిక మంత్రిగా ఎంచుకున్నారు. దీంతో 1991 జూన్‌లో మన్మోహన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజకీయేతర వ్యక్తిని ఆర్థిక మంత్రిగా నియమించడం వల్ల అందరూ ఆశ్చర్యపోయారు. అయితే ఆయన తన పనితీరుతో అందరికీ సమాధానం చెప్పారు.

**స్టాక్ ఎక్స్ఛేంజ్ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ!**

1992లో జరిగిన స్టాక్ ఎక్స్ఛేంజ్ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ 1993లో ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. అయితే ప్రధాని పీవీ ఆయనను వారించారు. 1991లో అసోం నుంచి మన్మోహన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1995, 2001, 2007, 2013లో రాజ్యసభ సభ్యుడయ్యారు. భాజపా అధికారంలో ఉన్న కాలంలో ఆయన రాజ్యసభలో కాంగ్రెస్ సభాపక్ష నేతగా వ్యవహరించారు. 1999లో దక్షిణ దిల్లీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ లైసెన్స్‌రాజ్‌కు చరమగీతం పాడారు. అదే సంస్కరణలను తాను ప్రధాని అయ్యాకా ఆయన కొనసాగించారు. ఆర్థిక మంత్రి చిదంబరంతో కలిసి 8 నుంచి 9శాతం ఆర్థిక వృద్ధి రేటును సాధించారు. ఆయన హయాంలో జీడీపీ వృద్ధిరేటు 9శాతానికి ఎగబాకింది. స్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టే పనిని మన్మోహన్ చేపట్టారు. పీవీ అంచనాలను సాకారం చేస్తూ ఆర్థిక రథాన్ని పరుగులు పెట్టించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా పీవీ-మన్మోహన్ జోడీకి మంచి మార్కులు పడ్డాయి. 2005లో సమాచార హక్కు చట్టం, ఉపాధిహామీ పథకం వంటివి తీసుకొచ్చారు.

దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు నేతృత్వంలో ఆర్థిక సంస్కరణలను పట్టాలెక్కించిన మన్మోహన్ సింగ్ ఆ తర్వాత కాలంలో పదేళ్ల పాటు ప్రధాన మంత్రి పదవిలో కొనసాగారు. 1991 అక్టోబరు 1న అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికై.. 2019 జూన్ 14 వరకు ఎగువ సభలో ఆ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. 2019 ఆగస్టు 20న రాజస్థాన్ నుంచి మళ్లీ రాజ్యసభకు ఎన్నికై ఈ ఏడాది ఏప్రిల్ 3 వరకు కొనసాగారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ రోజూ 18గంటల పాటు అవిశ్రాంతంగా పనిచేసేవారు.

**అతి సాధారణ కుటుంబంలో!**

ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న పశ్చిమ పంజాబ్‌లోని గహ్‌లో 1932 సెప్టెంబరు 26వ తేదీన సిక్కు కుటుంబంలో మన్మోహన్ సింగ్ జన్మించారు. ఆయన తల్లిదండ్రులు అమృత్ కౌర్, గుర్ముఖ్ సింగ్. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం భారత్‌కు వలస వచ్చింది. మన్మోహన్ చిన్న వయసులోనే తల్లి చనిపోవడం వల్ల నాన్నమ్మ వద్ద పెరిగారు. మన్మోహన్ పాఠశాల విద్య ఉర్దూ మీడియంలో కొనసాగింది. దీంతో ప్రధాని అయ్యాకా ఆయన తన హిందీ ప్రసంగాలను ఉర్దూలో రాసుకుని చదివేవారు. కొన్నిసార్లు తన మాతృభాష అయిన గుర్‌ముఖిలోనూ రాసుకునేవారు.

విభజన తర్వాత హల్ద్వానీకి, ఆ తరువాత అమృత్‌సర్‌కు మన్మోహన్ కుటుంబం వలస వచ్చింది. అక్కడి హిందూ కళాశాలలో చదివిన ఆయన ఆ తరువాత పంజాబ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 1952లో ఆర్థిక శాస్త్రంలో డిగ్రీతోపాటు 1954లో పీజీ చేశారు. చదువుల్లో ఎప్పుడూ ముందుండేవారు. 1957లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్నారు.

**అధ్యాపకుడిగా!**

కేంబ్రిడ్జిలో చదువు పూర్తయ్యాక భారత్‌కు తిరిగి వచ్చిన మన్మోహన్ పంజాబ్ వర్సిటీలో అధ్యాపకుడిగా చేరారు. 1960లో మళ్లీ ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్లి పీహెచ్‌డీలో చేరారు. ఆయన భారత్ ఎగుమతుల సామర్థ్యంపై థీసిస్ సమర్పించారు. 1957 నుంచి 59 వరకూ పంజాబ్ వర్సిటీలో సీనియర్ అధ్యాపకుడిగా పని చేశారు. 59 నుంచి 63 వరకూ రీడర్‌గా సేవలందించారు. 63 నుంచి 65 వరకూ ప్రొఫెసర్‌గా పని చేశారు. 1966 నుంచి 69 వరకూ ఐక్యరాజ్య సమితిలో సేవలందించారు. ఆ తరువాత విదేశీ వాణిజ్య మంత్రిత్వశాఖ సలహాదారుగా నియమితులయ్యారు. 1969 నుంచి 71 వరకూ దిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు.

1971లో కేంద్ర వాణిజ్యశాఖకు ఆర్థిక సలహాదారుగా నియమితులై అనతి కాలంలోనే ఆర్థిక మంత్రిత్వ శాఖకు ప్రధాన సలహాదారు అయ్యారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రధాన మంత్రికి సలహాదారుగా, యూజీసీ ఛైర్మన్‌గా బహుముఖమైన సేవలందించారు.

**వైద్యుడు కావాలనుకొని!**

మన్మోహన్ సింగ్ ప్రముఖ ఆర్థికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఆర్థికమంత్రిగా, ప్రధానిగా అద్భుతమైన సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపారు. ఆసక్తికరమైన విషయమేంటంటే తొలి రోజుల్లో తండ్రి కోరిక మేరకు ఆయన వైద్యుడు కావాలనుకున్నారట. 1948లో అమృత్‌సర్‌లోని ఖాల్సా కళాశాలలో ప్రీ-మెడికల్ కోర్సులో చేరారు. ఈ విషయాలను మన్మోహన్ కుమార్తె దమన్ సింగ్ స్ట్రిక్ట్‌లీ పర్సనల్‌బీ మన్మోహన్ అండ్ గురుశరణ్ పుస్తకంలో రాశారు. "ఆయన తండ్రి వైద్యుడు కావాలని అనుకోవడంతో రెండేళ్ల ఎఫ్‌సీఎస్ కోర్సులో మన్మోహన్ చేరారు. కొన్ని నెలల తర్వాత ఆ కోర్సు మానేశారు. వైద్యుడు కావాలన్న ఆసక్తినీ కోల్పోయారు" అని దమన్ సింగ్ పేర్కొన్నారు.

నిరాడంబరంగా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. 'నేను మసకగా ఉన్న కిరోసిన్ దీపం వెలుగులో చదువుకున్నాను. నేను ఇప్పుడు ఇలా ఉన్నానంటే కారణం నా చదువే' అని గతంలో ఓ సందర్భంలో చెప్పారు మన్మోహన్. అందుకే ఆయన వ్యక్తిగత జీవితం ప్రస్తావన వస్తే అందులో ముఖ్యంగా చర్చించుకునేది ఆయన చదువు గురించే. విద్య పట్ల మన్మోహన్ సింగ్‌కు ఉన్న శ్రద్ధ ఆయన పిల్లల విజయాల్లో కనిపిస్తుంది. మన్మోహన్ ముగ్గురు కుమార్తెలు ఉపిందర్ సింగ్, అమృత్ సింగ్, దామన్ సింగ్ తండ్రి బాటల్లోనే నడిచారు.

# మహిళా రిజర్వేషన్ చట్టం హుళక్కేనా?




'డీ లిమిటేషన్ చట్టం -2002' ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను మొదలు పెట్టాలంటే జనగణన చేయాలి. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2024%-%-2025 బడ్జెట్‌లో కేటాయించిన రూ. 1,309.46 కోట్ల పద్దులను చూస్తే మోదీ ప్రభుత్వానికి ఈ సంవత్సరం కూడా జనాభా గణన పక్రియను పూర్తిచేయాలనే ఉద్దేశం ఏ కోశానా లేదనే విషయం ప్రస్ఫుటంగా అర్థమవుతున్నది. దేశంలో జనాభా గణన చేయాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరం అవుతాయి. కానీ కేంద్ర బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించకపోవడమే అందుకు ఉదాహరణ. జనాభా గణన ప్రక్రియ పూర్తి కాకుండా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియ జరగటమనేది అసాధ్యం. అయితే డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మరో చట్టం మహిళా రిజర్వేషన్లు. ఈ బిల్లు ఆమోదం సులభమైనా దాని అమలు డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్నది.


డీలిమిటేషన్ అనేది రాజ్యాంగబద్ధమైన కార్యక్రమం. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం దీన్ని చేపడతారు. ప్రతి పదేళ్ళకోసారి జరిగే జనగణన ప్రక్రియ తర్వాత డీలిమిటేషన్ జరగాలి. డీలిమిటేషన్ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది తాత్కాలిక కమిషన్ కాబట్టి ఇందులో శాశ్వత ఉద్యోగులంటూ ఎవరూ ఉండరు. అందుకే పదవీ విరమణ పొందిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి దీనంతటికి సారథ్యం వహిస్తారు. దేశంలోని అన్ని గ్రామాలు, జిల్లాల వారీగా ఆయా రాష్ట్రాల జనాభా గణాంకాలను సేకరించి, అధ్యయనం చేసి ఈ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి తన ప్రాథమిక నివేదికను సమర్పిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం ఐదేళ్ళ సమయం పడుతుందని గత అనుభవాలు చెప్తున్నాయి. అయితే పెరిగిన సాంకేతికత వల్ల ఇప్పుడు అంత సమయం పట్టకపోవచ్చునని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నప్పటికీ అది కొంచెం అనుమానాస్పదమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. డీలిమిటేషన్ కమిషన్ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందంటే దాన్ని పార్లమెంటు కూడా మార్చలేదు. దానిని తప్పుబడుతూ ఎవరైనా కోర్టుకు వెళ్లినా చెల్లదు. డీ లిమిటేషన్ కమిషన్ ఏది చెప్తే అదే చట్టం, అదే శాసనం.

స్వాతంత్ర్యానంతరం దేశంలో ఇప్పటివరకు నాలుగుసార్లు (1952, 1963, 1973, 2002) మాత్రమే డీలిమిటేషన్ జరిగింది. 2002లో తెచ్చిన రాజ్యాంగ సవరణ ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన మళ్లీ 2026లో చేపట్టాల్సి ఉన్నది. అయితే కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రక్రియ మొదలుపెడితే కులగణన ప్రక్రియను కూడా చేపట్టాలనే డిమాండ్ రాష్ట్రాల నుంచి వ్యక్తమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే కులగణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. అందుకే జనగణన ఆలస్యమవుతున్నది. దానితో ముడిపడి ఉన్న డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. అది పూర్తయితేనే మహిళలకు రిజర్వేషన్ల చట్టం అమలు నోచుకుంటుంది. లేకుంటే ఆ చట్టం మహిళలకు అందని ద్రాక్షే అవుతుంది.

'డీ లిమిటేషన్ చట్టం -2002' ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను మొదలు పెట్టాలంటే జనగణన చేయాలి. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2024%-%-2025 బడ్జెట్‌లో కేటాయించిన రూ. 1,309.46 కోట్ల పద్దులను చూస్తే మోదీ ప్రభుత్వానికి ఈ సంవత్సరం కూడా జనాభా గణన
**మహిళా రిజర్వేషన్ చట్టం హుళక్కేనా?**

## భక్తి

## జీవన సత్యం



మనిషి గమ్యం చేరతాడు, ఒక లక్ష్యం ఉన్నప్పుడు. లక్ష్యం ఏర్పరచుకుంటాడు, సంకల్పం దృఢమైనప్పుడు. సంకల్పించుకుంటాడు, మంచి ఆలోచన రూపుదిద్దుకున్నప్పుడు. వీటన్నింటికీ మూలం ధర్మం. అది మనసులో పుట్టే కోరికలన్నింటికీ నిజమైన స్నేహితుడి వంటిది. తత్వోపదేశంలో గురువు వంటిది. యుద్ధరంగాన సైనికుడి వంటిది. ధనార్జనలో మంత్రి వంటిది. పోషణలో తల్లి వంటిది. ప్రయాణంలో తండ్రి వంటిది. చతుర్విధ పురుషార్థాల్లో ధర్మానిదే ప్రథమస్థానం. పోయేటప్పుడు మనిషి వెంట వచ్చేది ధర్మం ఒక్కటే!మనిషిలో ఉల్లాసం, ఉత్సాహం, ఆనందం, శాంతం, కార్యదీక్ష, సహనం తగ్గాయీ అంటే- అతడు ధర్మాన్ని విస్మరిస్తున్నాడన్న మాట. ధర్మం ఒక్కటే అతడికి అపూర్వమైన శక్తినిస్తుంది. అద్భుతమైన సంతృప్తి కలిగిస్తుంది.

ఐహికమైన ఆనందాలు, సరదాలు చాలా ఉంటాయి. అవేమీ శాశ్వతాలు కావు. దైహిక వాంఛల వలలో పడితే, మనిషి అదే లోకమనుకుంటాడు. బావిలో కప్పలా మారతాడు. నశ్వర భోగభాగ్యాల్లో కొట్టుమిట్టాడుతుంటాడు. తన జీవితానికి అసలు కావాల్సిందేమిటి, ఎటు వెళ్లాలి, ఎలా వెళ్లాలి? ఈ ప్రశ్నలే ఉదయించవు అజ్ఞాని మనసులో! అటువంటి మనసు- తెగిన గాలిపటం. ఆకులు కప్పి ఉండే వూబి. వివేకం కొరవడినప్పుడు, మనసే మనిషిని సుడిగుండంలో పడేస్తుంది.

హృదయ దౌర్బల్యాన్ని పిరికితనాన్ని విడిచి, కర్తవ్యం నిర్వహించేందుకు ముందుకు నడవాలని 'సాంఖ్యయోగం'లో అర్జునుడికి గీతాచార్యుడు చెబుతాడు. ఆ 'గీత' నుంచి ప్రేరణ పొందిన జాతిపిత బాపూజీ ఓ సందర్భంలో- 'నన్ను దైన్యం, నిరాశ, నిస్సత్తువ ఆవరించినప్పుడు గీతాపారాయణం చేస్తాను. గీతలోని ప్రతి శ్లోకమూ నాకు పోరాడే శక్తినిస్తుంది' అన్నారు.


సీతకు దూరమైన స్థితిలో శ్రీరాముడు ఆత్మస్థైర్యంతో వ్యవహరించి, తన ధర్మనిర్వహణ చేశాడని వాల్మీకి ప్రశంసించాడు. అశోకవనంలో తల్లడిల్లిన సీతాదేవికి త్రిజట మాటలు, రామదూతగా హనుమ ఇచ్చిన ఆనవాలు ఎంతో ధైర్యమిస్తాయి. కష్టాలకు విసిగిపోని మనిషే ఎప్పటికైనా విజయం పొందగలడన్నది అక్షరసత్యమని హనుమతో ఆమె అంటుంది.

లక్షలాది జీవరాశుల్లో దేనికీ లేని బుద్ధిని, మనసును మనిషికి భగవంతుడు ప్రసాదించాడు. ఆ బుద్ధి చేసే మార్గనిర్దేశనాన్ని మనసు అనుసరిస్తే చాలు- మనిషిని మించిన శక్తిమంతుడు ఉండడు. అతడు సర్వ శక్తిమంతుడన్నది యథార్థం. ధర్మం, కరుణ, సత్యం, ప్రేమ, అహింస, ధైర్యం తోడున్నంతవరకు అతడు సాధించలేని విజయమంటూ ఉండదు. ఎక్కలేని శిఖరమంటూ ఉండదు. ఎందరో ఇది వాస్తవమని నిరూపించారు. అనాదిగా వస్తున్న ఈ ఆర్షవాణిని ఆచరించడమే మనిషికి మంచి మార్గం చూపుతుంది. వృత్తిని దైవంగా, ప్రవృత్తిని ధర్మంగా భావించి ముందుకు సాగినప్పుడు- మనిషికి పరాజయమే ఉండదు, శత్రువులు ఉండరు. జ్ఞానం, దానం, శీలం అనే గుణాలు అతడికి అంగరక్షకుల్లా ఉంటాయి.మనిషిని చెడగొట్టేవి నాలుగు. అవి 'నేను, నాది, నువ్వు, నీది' అనే మాటలు. వాటికి మనసులో స్థానం ఇవ్వనంత వరకు, అతడు అజేయుడే! ఆధ్యాత్మిక నిబద్ధత లేని జీవితం- కవచం లేకుండా యుద్ధమైదానంలో నిలుచునే సైనికుడి లాంటిది. కోరికల్ని తగ్గించుకున్న కొద్దీ మానవుడికి నిబద్ధత పెరుగుతుంది. అదే అతడికి విజయకేతనం అందిస్తుంది. మనిషి సమాజంలో జీవిస్తున్నాడు. రుషులు ఒంటరిగా అడవుల్లో కూర్చుని సామాజిక శ్రేయస్సు కోసం తపస్సు చేశారు. సమాజం మధ్యనే బతుకుతుండే వ్యక్తి ప్రతి వస్తువుకూ ఇతరుల మీద ఆధారపడుతున్నాడు. ఆ కృతజ్ఞత అతడికి ఉండాలి. అప్పుడే ప్రేమ అంకురించి మహావృక్షమై విశ్వానికి సత్ఫలాలు ఇవ్వగలుగుతుంది. మనిషి జన్మ సార్థకమవుతుంది.

చేస్తున్న కొద్దీ పెరిగేది ధర్మం. ఇస్తున్న కొద్దీ పెరిగేది దానం. ఈ రెండూ మనిషి చేసే జీవనపోరాటంలో, అతడికి లభించిన దివ్యాస్త్రాలు. అప్పుడు మనిషి ఒంటరివాడు కాదు. అసహాయుడు అసలే కాదు. అనాథ అంతకన్నా కాదు. అతడికి ఎవరూ తోడు ఉండాల్సిన అవసరమూ లేదు. అతడే ఒక సైన్యం!



## సౌందర్యం సహజ సిద్ధంగా



ఆడవాళ్లను ఎక్కువగా వేధించే సమస్యల్లో 'అవాంఛిత రోమాలు' ఒకటి. వీటి కారణంగా ముఖం అందవిహీనంగా కనిపిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత కారణంగా వచ్చే ఈ సమస్య.. కొందరిని మానసికంగానూ కుంగదీస్తుంది. అయితే వీటిని తొలగించేందుకు కొందరు పడరాని పాట్లు పడుతుంటారు. బ్యూటీ పార్లర్లనీ, హెయిర్ రిమూవల్స్ అనీ.. ఏవేవో ప్రయత్నిస్తుంటారు. అన్నీ వాడి.. లేనిపోని సైడ్ ఎఫెక్ట్స్ తెచ్చుకుంటారు. అయితే, ఇంట్లో దొరికే పదార్థాలతోనే అవాంఛిత రోమాలను పూర్తిగా తొలగించుకోవచ్చని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. ఎలాంటి సైడ్ఎఫెక్ట్స్ లేకుండా సహజసిద్ధమైన సౌందర్యాన్ని సొంతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ముఖంపై ఉండే అవాంఛిత రోమాలను తొలగించడంలో పసుపు సమర్థంగా పనిచేస్తుంది. ఇందులోని సహజసిద్ధమైన గుణాలు.. వెంట్రుకల పెరుగుదలను నియంత్రించడంతోపాటు కుదుళ్లనూ బలహీనంగా మారుస్తాయి. పసుపులో కొద్దిగా పాలు కలిపి.. పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీనిని అవాంఛిత రోమాలు ఎక్కువగా ఉన్నచోట రాసుకోవాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగి.. శుభ్రం చేసుకోవాలి. బొప్పాయిలో ఉండే 'పాపైన్' అనే ఎంజైమ్.. జుట్టు కుదుళ్లను విచ్ఛిన్నం చేయడంలో, వెంట్రుకల పెరుగుదలను నిరోధించడంలో ముందుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జును తీసుకుని.. అలాగే ముఖంపై ఉండే అవాంఛిత రోమాలపై అప్లయి చేయాలి. 20 నిమిషాల పాటు అలాగే ఉంచి.. గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. అవాంఛిత రోమాలు తొలగిపోవడంతోపాటు ముఖ వర్ఛస్సూ పెరుగుతుంది. నిమ్మరసం.. సహజసిద్ధమైన ఎక్స్‌ఫోలియంట్‌గా పనిచేస్తుంది.

# నిన్నటి తరాన్ని ఫాలో అయిపోదాం..

## పిల్లలను ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహిద్దాం..



ఆ రోజుల్లో పిల్లల ఆటలన్నీ ఆరుబయటే! 2000 సంవత్సరం వరకు పిల్లల జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండేది. రోజంతా మైదానాల్లో గడిపేవారు. నేటి తరం పిల్లలకు స్మార్ట్‌ఫోనే గ్రౌండ్‌గా మారిపోయింది. వీడియోగేమ్సే ఆటవిడుపుగా మారాయి. అయితే, ఆరుబయట ఆడుకునే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధన తేల్చింది. ఈ ఆటలు వారిలో శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక నైపుణ్యాలనూ మెరుగుపరుస్తాయని వెల్లడించింది.

నాటి తరానికి తెర అంటే.. టీవీ మాత్రమే! సినిమా అంటే.. ఆదివారమే! కానీ, ఇప్పటి పిల్లలు రోజంతా స్క్రీన్‌లోనే గడిపేస్తున్నారు. ఆటలేకాదు, పాఠాలు కూడా స్క్రీన్‌కు అంకితమై వింటున్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్.. ఇలా స్క్రీన్ ఉచ్చులో చిక్కుకొని అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. దేశంలో దాదాపు 61 శాతం మంది తల్లిదండ్రులు, తమ పిల్లల స్క్రీన్‌టైమ్ గురించి ఆందోళన చెందుతున్నారని పలు పరిశోధనల్లో తేలింది. స్మార్ట్ దునియాలో చక్కర్లు కొడుతున్న బాల్యం.. పిల్లల భాషాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతున్నదనీ, వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నదని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. అందుకే, పిల్లల స్క్రీన్‌టైమ్ తగ్గించాలనీ, వారిని ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలనీ సూచిస్తున్నారు.

**పుస్తకాలే నేస్తాలు..**

నైంటీస్ కిడ్స్ దాచుకున్న స్లామ్‌బుక్స్‌ను ఒక్కసారి తిరగేయండి. చాలా పేజీల్లో హాబీస్ దగ్గర.. 'రీడింగ్ బుక్స్' అనే కనిపిస్తుంది. పుస్తకాలే నేస్తాలుగా గడిచిన బాల్యం వాళ్లది. చందమామ కథలు చదువుతూ.. నిద్రలోకి జారుకున్న తరం వాళ్లది. మరిప్పుడో.. స్కూల్ బుక్స్, హోమ్ వర్క్ తప్ప, వేరే పుస్తకమే తెలియకుండా రోజులు గడిపేస్తున్నారు. కాబట్టి.. మీ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచండి. ప్రతిరోజూ పడుకునే ముందు.. వారికి ఒక మంచి పుస్తకం ఇచ్చి చదవమనండి. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. భాషా నైపుణ్యాలూ మెరుగుపడుతాయి.




**ప్రకృతి ప్రేమికులు..**

నాటికాలం పిల్లలు.. ప్రకృతి ప్రేమికులు. చుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూసే ఎక్కువగా నేర్చుకున్నారు. నేటితరానికి ఇల్లు, స్కూలూ తప్ప.. వేరే ప్రాంతం పెద్దగా తెలియదు. అయితే.. ప్రకృతితో మమేకమైతేనే.. పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. సమస్య-పరిష్కార సామర్థ్యాలు మెరుగుపడతాయన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. అందుకే.. ప్రకృతిలో ఉన్న వింతలను, సహజత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వైరస్‌లు, బ్యాక్టీరియాలు అంటూ భయపెట్టకుండా.. పిల్లల్ని స్వేచ్ఛగా మట్టిలో ఆడుకోనివ్వాలి. నీళ్లలో గెంతనివ్వాలి. ప్రకృతిని ప్రేమించేలా.. వారిని ప్రోత్సహించడం చాలా అవసరం.

**బంధాలతో అనుబంధం**

90వ దశకంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఏ పండుగొచ్చినా ఇళ్లన్నీ జనాలతో అనుబంధాల కలబోతలా కళకళలాడేవి. నలుగురు కలిసి ఒక ఇంట్లో ఉండటమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో.. ఇప్పటితరం కుటుంబంతో కన్నా సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువగా గడుపుతున్నది. ఫలితం.. మనిషికి ఉండాల్సిన సహజ భావోద్వేగాలు కూడా మృగ్యమైపోతున్నాయి. ఈ పోకడ.. వారి భవిష్యత్తులో మరిన్ని విపత్కర పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి, పిల్లల మధ్య ప్రేమానురాగాలు పెరిగేలా చూడండి. రోజుకు ఒకపూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా ప్లాన్ చేసుకోండి. అన్నదమ్ముల పిల్లలను తరచూ కలుసుకునే పరిస్థితులు కల్పించండి. తద్వారా వారికి బంధాల విలువ తెలిసొస్తుంది.

## వేపుళ్లు ఆరోగ్యాన్ని వేయించొద్దు



పళ్లెంలో వేపుడు ముక్కలు చూస్తూనే నోట్లో నీళ్లూరిపోతుంటాయి. కమ్మగా కరకరలాడుతూ.. కాస్త కారంకారంగా ఉండే వేపుడు కూర వడ్డిస్తానంటే వద్దనే వాళ్లు ఎవరు? ఈ వేపుళ్లను వేగంగా వండెయ్యొచ్చు. పెద్ద ఖర్చూ అవ్వదు. పైగా అంతా ఇష్టంగా తింటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఈ వేపుడు వంటకాలదే తొలి దర్శనం! అలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్.. ఫ్రైడ్ ఫిష్.. చికెన్ స్ట్రిప్స్.. చీజ్ స్టిక్స్.. రుచి విషయంలో వీటి గురించి మరో ఆలోచనేం అక్కర్లేదు. కానీ మరగకాగిన నూనెలో ముంచి తీసే ఈ రకం వేపుడు వంటకాలు ఆరోగ్యానికి మాత్రం అస్సలు మంచివి కావని వైద్యపరి శోధనా రంగం స్పష్టంగా హెచ్చరిస్తోంది. ఎందుకిలా? ఏమిటి వీటితో నష్టం?

**తొలి ముప్పు క్యాలరీల తంటా**

వేపుడు కూరల నుంచి వచ్చే క్యాలరీలు చాలా ఎక్కువ. ఎందుకంటే ముక్కలను వేడివేడి నూనెలో ముంచి తీసినప్పుడు వాటిలో ఉండే నీరంతా ఆవిరైపోతుంది, ఇదే సమయంలో అవి నూనెను బాగా పీల్చుకుంటాయి. నూనె వంటి కొవ్వుల నుంచి మనకు అందే శక్తి (అంటే క్యాలరీలు) చాలా చాలా ఎక్కువ. అందుకే ఉడికించటం, నిప్పుల మీద కాల్చటం వంటి ఇతరత్రా పద్ధతుల్లో వండిన వాటికంటే నూనె వేపుళ్ల నుంచి మనకు చాలా ఎక్కువ క్యాలరీల శక్తి అందుతుంది. చిన్న ఉదాహరణ చూద్దాం. 100 గ్రాముల బంగాళదుంప ముక్కలను ఉడికించామనుకోండి. దాన్నుంచి మనకు దాదాపు 93 క్యాలరీల శక్తి అందుతుంది, కొవ్వు పెద్దగా ఉండదు. అదే ఆలూ ముక్కలను వేడివేడి నూనెలో వేసి బాగా కరకరలాడేలా వేయించామనుకోండి (డీప్ ఫ్రై). వాటి నుంచి దాదాపుగా 17 గ్రాముల కొవ్వు, 319 క్యాలరీల శక్తి అందుతాయి. అలాగే 100 గ్రాముల చేప ముక్కలను ఉడికిస్తే వాటి నుంచి 105 క్యాలరీల శక్తి, 1 గ్రాము కొవ్వు మాత్రమే అందుతాయి. అదే చేప ముక్కలను నూనెలో వేయిస్తే 232 క్యాలరీల శక్తి, 12 గ్రాముల వరకూ కొవ్వు అందుతాయి. కాబట్టి మనం వండే పద్ధతి వల్ల కొవ్వు, క్యాలరీలు పెరిగిపోతాయని, తరచూ వేపుళ్లను తింటుంటే దీనివల్ల వూబకాయం, మధుమేహం వంటి చాలా రకాల సమస్యలు పొంచి ఉంటాయని గుర్తించాలి.

**జబ్బులూ రుచి చూడాల్సి రావచ్చు!**

- గుండె జబ్బులు: వేపుడు పదార్థాలు ఎంత తరచుగా తింటుంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా పెరుగుతోందని ఇటీవలి కాలంలో జరిగిన రెండు అతి పెద్ద అధ్యయనాల్లో గుర్తించారు. తరచూ వేపుళ్లు తింటున్న వారిలో హైబీపీ సమస్య ఎక్కువగా ఉంటోంది, మరోవైపు మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) స్థాయులు ఉండాల్సినంత ఉండటం లేదు. ఈ రెండూ గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.

- మధుమేహం: వేపుడు పదార్థాలను వారానికి ఒకసారి తింటున్న వారితో పోలిస్తే- వారానికి 4-6 సార్లు తింటున్న వారిలో మధుమేహం వచ్చే ముప్పు 39% అధికంగా ఉంటోంది. వేపుడు పదార్థాల్లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల వల్ల బరువు పెరగటంతో పాటు ఆకలిని నియంత్రించే హార్మోన్లు కూడా అస్తవ్యస్తమైపోతున్నాయని, ఇది మధుమేహం, వూబకాయాలకు దారి తీస్తోందని గుర్తించారు.

- క్యాన్సర్లు: వండేప్పుడు ఆహారపదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతల వద్దకు తీసుకువెళుతున్నప్పుడు దానిలో 'అక్రిలమైడ్' అనే విషతుల్యం తయారవుతుంది. పొగలొస్తున్న నూనెల్లో వేయించటం, కణకణ మండే నిప్పుల మీద కాల్చటం, మాడ్చటం వంటివన్నీ ఈ రకమైన రసాయనిక చర్యకు ఆస్కారం ఇస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆలుగడ్డల వంటి వాటిలో ఉండే పిండిపదార్థాలు, చక్కెరలు, ఆస్పరాజిన్ అనే అమైనో ఆమ్లం- ఇలాంటి వాటన్నింటి మధ్యా రసాయన చర్యలు జరిగి 'అక్రిలమైడ్' తయారవుతోంది.

ఇది చాలా రకాల క్యాన్సర్లకు కారణమవుతోందని జంతువులపై జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది. దీని ప్రభావం మనుషుల మీద ఎలా ఉంటోందన్న దిశగా ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. వేపుళ్ల వల్ల క్యాన్సర్ రాదని మాత్రం ఇంత వరకూ ఎవరూ నిర్ధారించలేదు.

**మరో ముప్పు ట్రాన్స్ ఫ్యాట్స్ తిప్పలు**

వంట నూనెలను మరగకాచినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద దానిలో రసాయనిక స్వభావం మారిపోయి అవి 'ట్రాన్స్ ఫ్యాట్స్' రకం కొవ్వులుగా మారిపోతాయి. ఈ తరహా కొవ్వులను మన శరీరం తేలికగా అరిగించుకోలేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి చాలా రకాల ఆరోగ్య సమస్యలు బయల్దేరతాయి. బయట ప్యాకెట్లలో దొరికే వేపుడు పదార్థాలతో కూడా ఈ రకం సమస్య తప్పదు. పైగా ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు తయారీదారులు వాటిని అధిక పీడనంతో హైడ్రోజెన్ వాయువును ఉపయోగించి ప్రత్యేక పద్ధతిలో వండుతారు. దీన్నే 'హైడ్రోజినేషన్' అంటారు. దీనివల్ల కూడా ఆయా వేపుడు పదార్థాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల స్థాయి పెరిగిపోతుంది. మరో పెద్ద సమస్య ఏమంటే- వంట నూనెలను మన ఇళ్లలోనూ, హోటళ్లలో కూడా ఒక్కసారే వాడరు. అవసరమైనప్పుడల్లా మరగకాచి వండుతుంటారు, మళ్లీ భద్రపరుస్తుంటారు. ఇలా ఒకసారి కాచిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేస్తుండటం వల్ల వాటిలోని ప్రమాదకర ట్రాన్స్ ఫ్యాట్స్ స్థాయులు మరింతగా పెరిగిపోతున్నాయని పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు. వేపుళ్లు వండాలంటే నూనెను విపరీతంగా కాచక తప్పదు, ఆ నూనెతో ఈ తరహా అనారోగ్యకరమైన ముప్పులూ తప్పవు.


మరి మనమేం చెయ్యాలి?

- వేపుడు పదార్థాలను మరీ తరచుగా తినకుండా ఉండటం అత్యుత్తమం. ఎప్పుడన్నా ఒకసారి తింటే ముప్పు మరీ అంత ఎక్కువగా ఉండదు.

- పని తేలిక అవుతుందని, వంటకాలు రుచిగానూ ఉంటాయని ప్రతి కూరనీ నూనెలో పోసి వేయించెయ్యకుండా... ఇతరత్రా వంట పద్ధతులపైనా ద ృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇగురు కూరలు, ఉడికించిన వంటకాలను కూడా రుచికరంగా చేసుకునే పద్ధతులు తెలుసుకోవాలి.

- మరీ ఎప్పుడన్నా కావాలనుకుంటే వేపుళ్లను ఓవెన్‌లోనో, ఎయిర్ ఫ్రైయర్ల వంటి వాటిలోనో చేసుకుంటే- నూనెలో ముంచి తియ్యాల్సిన పని లేకుండానే ముక్కలు కరకరలాడతాయి!

# సూర్య నమస్కారం చేద్దాం



సూర్యుడు నమస్కార ప్రియుడు. కేవలం అయిదు నిమిషాలు నమస్కరిస్తే చాలు శరీరం, మనసు ఉత్తేజితం అవుతాయని పెద్దలు చెబుతుంటారు. సూర్యుడు ఉదయించగానే తూర్పు దిక్కుకు అభిముఖంగా నిలబడి సూర్య నమస్కారం చేయాలి....

**సూర్య నమస్కారం చేద్దాం**

సూర్యుడు నమస్కార ప్రియుడు. కేవలం అయిదు నిమిషాలు నమస్కరిస్తే చాలు శరీరం, మనసు ఉత్తేజితం అవుతాయని పెద్దలు చెబుతుంటారు. సూర్యుడు ఉదయించగానే తూర్పు దిక్కుకు అభిముఖంగా నిలబడి సూర్య నమస్కారం చేయాలి. అలాగే సాయంత్రం పూట పశ్చిమ దిక్కుకు నిలబడి సాధన చేయవచ్చు. యోగాలో సూర్య నమస్కారాన్ని పన్నెండు ఆసనాల ద్వారా చేస్తుంటారు. వీటిలో కనీసం మూడింటిని ప్రతిరోజూ సాధన చేస్తూ ఉంటే అనారోగ్యం దరిచేరదు. సూర్య నమస్కారంతో దినచర్య ప్రారంభించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం!

**జీర్ణ వ్యవస్థకు**

సూర్య నమస్కారంలో భాగంగా శరీరాన్ని ముందుకు వంచడం, సాగదీయడం వల్ల పొత్తికడుపుపై ఒత్తిడి పెరుగుతుంది. దీనితో కడుపులో పేరుకున్న వాయువులు బయటికి వెళ్లిపోతాయి. పేగుల్లో రక్త ప్రసరణ మెరుగవుతుంది. పొట్టలో వేడి ఉత్పత్తి కావడం వల్ల ఆహారపదార్థాలు తేలికగా జీర్ణమవుతాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు రావు.

**బరువు తగ్గేందుకు**

ఏ భంగిమలో సూర్య నమస్కారం చేసినప్పటికీ శరీరంలో శక్తి ఖర్చయిపోతుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. దీనివల్ల శరీరంలో నిల్వ ఉన్న అదనపు కొవ్వులు పూర్తిగా కరిగిపోతాయి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా కనీసం మూడు భంగిమల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

**శిరోజాలకు**

సూర్య నమస్కారాల్లో భాగంగా తల వంచడం, తిప్పడం, ఎత్తడం వంటివి చేస్తాం. దీనివల్ల తల మీద ఉన్న చర్మానికి వేగంగా రక్తప్రసరణ జరిగి వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. దీంతో వెంట్రుకలు రాలడం, జుట్టు నెరవడం వంటి సమస్యలు తీరిపోతాయి. మంచి పోషణ అంది శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.

**చర్మానికి**

సూర్యునికి ఎదురుగా నిలబడి సూర్య నమస్కారాలు చేస్తున్నపుడు చెమట ద్వారా చర్మంలోని వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వచ్చేస్తాయి. దీంతో చర్మం తాజాగా ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఉదయాన్నే సూర్య నమస్కారం చేస్తే చర్మానికి తగిన పోషణ అంది ముడతలు, గీతలు రావు. అంతగా తీవ్రతలేని సూర్యకిరణాల వేడివల్ల చర్మం మీద కొత్త కణాలు ఉత్పత్తి అయి మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి. సాయంత్రం సమయాల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరం అలసిపోయి మంచి నిద్ర పడుతుంది. తగినంత విశ్రాంతి పొందడం వల్ల శరీరం, మనసు ఉత్సాహంగా ఉండి ముఖానికి కొత్త కాంతి వస్తుంది.

**నెలసరి సమస్యలకు**

మహిళలు ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడం వల్ల లిపిడ్ ప్రొఫైల్ మెరుగుపడి నెలసరి సమస్యలు తగ్గుతాయి. నీరసం, బలహీనత, పొత్తి కడుపు నొప్పి బాధించవు. ప్రతిరోజూ కనీసం పావుగంట శరీరానికి ఎండ తగిలేలా సూర్య నమస్కారాలు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

## రోజూ ఓట్స్ తింటే ఎన్నో లాభాలు..!



నేటి తరుణంలో ఓట్స్‌ను సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తున్నారు. ఎందుకంటే ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. అవి మధుమేహం, గుండె జబ్బులు ఉన్నవారికి మేలు చేస్తాయి. అందుకనే ప్రస్తుతం వైద్యులు, న్యూట్రిషనిస్టులు ఓట్స్‌ను ఆహారంగా తీసుకోవాలని చెబుతున్నారు. కేవలం అనారోగ్య సమస్యలున్నవారు మాత్రమే కాదు, ఆరోగ్యవంతులు కూడా ఓట్స్ తినడం వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఓట్స్‌లో ఉండే బీటా గ్లూకాన్ అనే కరిగే ఫైబర్ (పీచు పదార్థం) రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. దీంతో గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.
2. మధుమేహం ఉన్నవారికి ఓట్స్ మేలు చేస్తాయి. ఓట్స్ తినడం వల్ల రక్తంలో ఉండే గ్లూకోజ్ లెవల్స్ అమాంతం పెరగవు. కంట్రోల్‌లో ఉంటాయి. అందువల్ల ఓట్స్‌ను వారికి మంచి ఆహారంగా చెప్పవచ్చు. దీంతో మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చు.
3. ఓట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ సమ ృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ మీద పోరాటం చేస్తాయి. దీంతో శరీర కణజాలం నాశనం కాకుండా ఉంటుంది. అలాగే నొప్పులు, వాపులు తగ్గుతాయి.
4. అధిక బరువు తగ్గాలనుకునే వారికి ఓట్స్ మంచి ఆహారం. కొద్దిగా ఓట్స్‌ను తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సమయం వేచి ఉన్నా ఆకలి కాదు. దీంతో ఇతర ఆహారాలను తినకుండా ఉండవచ్చు. తద్వారా బరువు తగ్గుతారు.
5. హైబీపీ, క్యాన్సర్‌లను తగ్గించే గుణాలు ఓట్స్‌లో ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల పెద్ద పేగు పనితీరుకు ఓట్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. అంతేకాదు, ఓట్స్ తినడం వల్ల చర్మం సంరక్షింపబడి కాంతివంతంగా, మ ృదువుగా మారుతుంది.

# బిజినెస్




## ఫార్మా హెల్త్ కేర్ స్టాక్స్‌తో లాభాలతో ముగిసిన ఈక్విటీ



**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 226 పాయింట్ల లబ్ధితో 78,699.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 79,043.15 పాయింట్ల గరిష్టం నుంచి 78,699.07 పాయింట్ల కనిష్టానికి చేరుకున్నది. మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 63 పాయింట్ల లబ్ధితో 23,813.40 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 23,938.85 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 23,800.60 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది. ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్, ఫైనాన్సియల్ స్టాక్స్ కొనుగోళ్లతో ఈక్విటీ మార్కెట్లకు కలిసి వచ్చింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50లో 29 స్టాక్స్ లాభాలతో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎచిర్ మోటార్స్, విప్రో స్టాక్స్ 2.51 శాతం వరకూ లబ్ధి పొందాయి. మరోవైపు హిందాల్కో, కోల్ ఇండియా, ఎస్బీఐ, ఓఎన్జీసీ, టాటా స్టీల్స్ సహా 21 స్టాక్స్ 1.81 శాతం వరకూ నష్టపోయాయి. నిఫ్టీ ఫార్మా 1.30 శాతం వృద్ధి చెందితే నిఫ్టీ ఆటో 0.97, నిఫ్టీ హెల్త్ కేర్ 0.80 శాతం లాభ పడ్డాయి. నిఫ్టీ మెటల్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు, నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్ సర్వ్ లబ్ధి పొందాయి. ఎస్బీఐ, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, అల్ట్రాటెక్ సిమెంట్ నష్టపోయాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ మరో 25 పైసలు పతనమై రూ.85.52లకు చేరింది.

## ఈవీ స్టేషన్లు ఏవి?

### చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం



**హైదరాబాద్-నవభూమి:** ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను వేగంగా ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశిస్తున్నా, రాష్ట్రంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనూ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రమంతటా 750 చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి సంఖ్యను 2,000 పెంచాల్సిన అవసరం ఉన్నదని అధికారులు గుర్తించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగింది. వీటికోసం కనీసం 150 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో)ను ఆదేశించింది. ఇంతవరకు 72 మాత్రమే నిర్వహణలోకి వచ్చాయి. మరో 59 ఏర్పాటుకు పనులు సాగుతున్నట్టు అధికారులు తెలిపారు. మిగతా 19 ఏర్పాటుకు అవసరమైన స్థలాలను చూపడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తెలిసింది.

**ప్రభుత్వ స్థలాలివ్వాలన్న కేంద్రం**

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల కొరతను అధిగమించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అవరణల్లో ఖాళీ స్థలాలను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు ముసాయిదాను అన్ని రాష్ట్రాలకు పంపింది. ఈ మేరకు ప్రతిపాదనలపై అభ్యంతరాలను, సలహాలను పంపాలని రాష్ట్రాలకు సూచించింది. ఈవీ చార్జింగ్ స్టేషన్లకు స్థలాలు ఇవ్వడానికి నిబంధనలు, టెండర్ బిడ్డింగ్ ప్రక్రియ విధానాన్ని రూపొందించాలని సూచించింది. స్థలాలను పొందేందుకు అందరికీ అవకాశాలు కల్పించాలని, చార్జింగ్ స్టేషన్లు 24 గంటలు పనిచేసేందుకు అవసరమైన అన్నిరకాల అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి, సమస్యల పరిష్కారానికి ఒక ప్రభుత్వ సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించాలని సూచించింది.

**కేంద్రాల ఏర్పాటుకు కమిటీ వేయాలి**

రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, రవాణా, పురపాలక, ఇతర అవసరమైన విభాగాల వారితో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక, పర్యవేక్షణ బాధ్యతలు ఈ కమిటీకి అప్పగించాలని పేర్కొంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖలు కూడా రాసింది. కానీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**ఎన్‌వోసీ తప్పనిసరి**

టీజీ రెడ్కో నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకొని ప్రైవేటు వ్యక్తులు ఎక్కడైనా రోడ్డు పక్కన స్థలం ఉంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ పెట్టుకోవచ్చు. అపార్టుమెంట్లలో అందరికీ ఉపయోగపడేలా చార్జింగ్ స్టేషన్ పెట్టాలన్నా ఎన్‌వోసీ తప్పనిసరి. అది లేకుండానే హైదరాబాద్ నగరంలోని కొన్ని అపార్టుమెంట్లలో చార్జింగ్ స్టేషన్లు పెడుతున్నట్టు అధికారులు గుర్తించారు.

## చిన్నషేర్లు.. పెద్ద లాభాలు

### 2024లో అత్యధిక లాభాలు పంచిన స్మాల్ స్టాక్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** చిన్న షేర్లు పెద్ద లాభాలు పంచాయి. ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టినవారికి అత్యధిక రాబడిని పంచాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై నమ్మకం ఉండటంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడి పెట్టుబడులు పెట్టడంతో సూచీలు రికార్డు స్థాయికి ఎగబాకాయి. బ్లూచిప్ సంస్థలతోపాటు చిన్న, చితక సంస్థల షేర్లు కదంతొక్కాయి.

ఈ నెల 23 వరకు బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఏకంగా 12,144.15 పాయింట్లు లేదా 28.45 శాతం లాభపడింది. అలాగే మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా 9,435.09 పాయింట్లు లేదా 25.61 శాతం ఎగబాకింది. కానీ, 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 6,299.91 పాయింట్లు లేదా 8.72 శాతం మాత్రమే పెరిగింది. ఈ నెల 12 ముగిసేనాటికి బీఎస్ఈ స్మాల్‌క్యాప్ చారిత్రక గరిష్ఠ స్థాయి 57,827.69కి చేరుకోగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 49,701.15కి చేరుకున్నది. ప్రాంతీయంగా ఉండే ఇన్వెస్టర్లు ఎక్కువశాతం చిన్న స్థాయి స్టాక్‌లను కొనుగోలు చేస్తుంటారు, అలాగే విదేశీ పెట్టుబడిదారులు బ్లూచిప్ సంస్థలు లేదా అతిపెద్ద సంస్థల్లో తమ పెట్టుబడులు పెడుతుంటారు.

మిడ్‌క్యాప్ ఇండెక్స్ సరాసరి బ్లూచిప్ సంస్థల్లో ఐదోవంతుని, స్మాల్‌క్యాప్ సంస్థలు పదో వంతు కలిగివుండనున్నాయి. వచ్చే ఏడాదిలోనే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఇదే తరహాలో లాభాలు పంచే అవకాశాలున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి.'స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు మెరుగైన ప్రదర్శనగావించాయి. ఈ రంగాలు అత్యధిక వృద్ధి నమోదు చేసుకోవడం, అనుకూల మార్గదర్శకాలు, పెట్టుబడిదారులు ఆసక్తి చూపారు. రియల్ ఎస్టేట్, మౌలికం, హెల్త్‌కేర్, రెన్యూవబుల్ ఎనర్జీ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయి.

# భారతదేశ అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజీ అయిన కాయిన్‌డిసిఎక్స్

## కాయిన్ డీసీఎక్స్ హెచ్ఎన్ఐ కస్టమర్లలో 20% మంది మహిళలు

**బెంగళూరు-నవభూమి:** భారతదేశ అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజీ అయిన కాయిన్‌డిసిఎక్స్, భారతీయ క్రిప్టో మార్కెట్ల డైనమిక్ పరిణామాలపై దృష్టి పెడుతూ 2024కి సంబంధించిన వార్షిక నివేదికను విడుదల చేసింది. దీర్ఘకాలిక వృద్ధి వ్యూహాలపై దృష్టి సారించడం, మహిళా మదుపరుల నుండి పెరిగిన భాగస్వామ్యం, చిన్న నగరాల్లో పెరుగుతున్న అనుసరణ సంచలనాత్మక ధోరణులతో మదుపరుల ప్రవర్తనలో గణనీయమైన మార్పును నివేదిక ప్రముఖంగా చాటిచెబుతుంది. ఇప్పుడు సగానికి పైగా మదుపరులు తమ పోర్ట్‌ఫోలియోలలో బిట్‌కాయిన్, ఆల్ట్ కాయిన్‌లను కలిగి ఉన్నారు. భారతీయ క్రిప్టో వ్యాపారులు ఎలా పరిపక్వం చెందుతున్నారు, వారి ఆస్తి కేటాయింపులో మరింత వ్యూహాత్మకంగా మారుతున్నారు, డిజిటల్ ఆస్తుల పరివర్తన సామర్థ్యాన్ని ఎలా స్వీకరించారో కాయిన్ డీసీఎక్స్ చాటిచెబుతోంది.

**వార్షిక నివేదిక 2024 ముఖ్యాంశాలు**

**పోర్ట్‌ఫోలియో మెచ్యూరిటీ:**

51.5% మదుపరుల పోర్ట్‌ఫోలియోలు ఇప్పుడు బిట్ కాయిన్ ఆల్ట్ కాయిన్స్ లో ఉన్నాయి, ఇది దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాల వైపు బలమైన మార్పును సూచిస్తుంది.

లేయర్ 2 సొల్యూషన్‌లు, వికేంద్రీకృత అప్లికేషన్‌ల వంటి ప్రాజెక్ట్‌లపై పెరుగుతున్న విశ్వాసం ద్వారా ఆల్ట్ కాయిన్స్ 34.5% కేటాయింపుతో ముందుంది.

చేపట్టడంలో 253.33% పెరుగుదల

ఎర్న్ ఆర్డర్‌లలో 392.73% పెరుగుదల

**లాభదాయకత**

50%ం కాయిన్ డీసీఎక్స్ మదుపరులు, వ్యాపారుల పోర్ట్‌ఫోలియోలు లాభాల్లో ఉన్నాయి, ఇది బలమైన మార్కెట్ పనితీరును చాటిచెబుతుంది

వృద్ధి..159.65% - ట్రేడింగ్ పరిమాణంలో పెరుగుదల అనేది అధిక యూజర్ యాక్టివిటీ, మార్కెట్ మొమెంటంను ప్రతిబింబిస్తుంది.

366.67% - నిర్వహణలో ఉన్న ఆస్తులలో పెరుగుదల (అనేది మదుపరుల బలమైన విశ్వాసం మరియు అనుసరణను తెలియజేస్తుంది.

అమెరికా ఎన్నికలకు ముందు, తర్వాత పెట్టుబడి ధోరణులు..జనవరి 1 - నవంబర్ 5: 309 రోజులలో, మొత్తం పెట్టుబడులు 2.94 బిలియన్లకు చేరుకు న్నాయి, సగటున రోజుకు 9.5 మిలియన్లు.

నవంబర్ 5 - డిసెంబర్ 10: ఎన్నికల అనంతర ఫలితాలు, పెట్టుబడులు కేవలం 34 రోజుల్లో 1.2 బిలియన్లకు చేరాయి, రోజువారీ సగటు 35.3 మిలియన్లు.

**భౌగోళిక విస్తరణ:**

దేశవ్యాప్త క్రిప్టో కార్యకలాపాల్లో ఢిల్లీ, ముంబై సంయుక్తంగా 22%తో ముందంజలో ఉన్నాయి. ద్వితీయ శ్రేణి నగరాలు 40% వాటాను కలిగి ఉండడం పెరుగుతున్న క్రిప్టో స్వీకరణ, అందరికీ అందుబాటును చాటిచెబుతుంది.

క్రిప్టోలో మహిళలు:

ఇప్పుడు కాయిన్ డీసీఎక్స్ హెచ్ఎన్ఐ కస్టమర్లలో 20% మంది మహిళలు ఉన్నారు. ఢిల్లీ (28.3%), లక్నో (19.16%), హైదరాబాద్ (16.5%) వంటి నగరాలు తమ ప్రాధాన్య టోకెన్‌లలో ETH, BTC, MATIC, ఈ ట్రెండ్‌ను నడుపుతున్నాయి.

2024 అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినవి:

(374.30%) (338.60%) వంటి టోకెన్‌లు 10 బిలియన్లకు మించి న విలువలతో ఆస్తుల మధ్య లాభాలకు దారితీశాయి. పాప్‌క్యాట్ వంటి ఎమర్జింగ్ టోకెన్‌లు 14,844% పెరిగాయి, ఇది మార్కెట్ డైనమిక్ స్వభావాన్ని నొక్కి చెబుతుంది. ఈ సందర్భంగా కాయిన్ డీసీఎక్స్ సహ వ్యవస్థాపకుడు సుమిత్ గుప్తా మాట్లాడుతూ, "మేం ఈ సంవత్సరాన్ని ముగిస్తున్న సందర్భంలో ఒక సందేశం స్పష్టంగా నిలుస్తుంది- మదుపరులు, పరిశ్రమ పరిపక్వత. ఈ సంవత్స రం డేటా క్రిప్టో మార్కెట్ స్థితిస్థాపకతను మాత్రమే కాకుండా దీర్ఘకాలిక వృద్ధి కోసం సమతుల్య పోర్ట్‌ఫోలియోలను నిర్మించే మదుపరుల పెరుగుతున్న విశ్వాసాన్ని కూడా ప్రదర్శిస్తుంది. ఈ పరివర్తన డిజిటల్ ఆస్తుల భవిష్యత్తుపై, గ్లోబల్ ఫైనాన్స్‌ను పునర్నిర్మించడంలో వారి పాత్రపై నా విశ్వాసాన్ని నింపింది. రాబోయే కాలాన్ని చూస్తున్నప్పుడు, ఈ పరివర్తన యుగాన్ని నావిగేట్ చేయడానికి సురక్షితమైన, వినూత్నమైన, ప్రాప్యత చేయ గల సాధనాలతో వినియోగదారులను శక్తివంతం చేయడానికి కాయిన్ డీసీఎక్స్ కట్టుబడి ఉంది" అని అన్నారు.

నివేదిక 2024లో కాయిన్ డీసీఎక్స్ ముఖ్యమైన విజయాలను కూడా చాటిచెబుతుంది, వీటిలో:


ఉత్పత్తి ఆవిష్కరణ: వికేంద్రీకృత కస్టడీ వాలెట్ ఆక్టో ప్రారంభం. ఇది వినియోగదారు నియంత్రణ, భద్రత ను మెరుగుపరుస్తుంది.

**అంతర్జాతీయ విస్తరణ:** దుబాయ్‌లో ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఉనికిని బలో పేతం చేయడానికి బిట్ ఒయాసిస్‌ను కొనుగోలు చేయడం.

ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్: కాయిన్ డీసీఎక్స్ 'లెర్న్ కరో' కోసం గౌతమ్ గంభీర్ తో కలసి పని చేస్తోంది. భారతదేశంలోని 160 మిలియన్ల మదుపరులలో విద్యను, క్రిప్టోపై నమ్మకాన్ని పెంచడం 'క్రిప్టో కరో' ప్రచార కార్యక్రమ లక్ష్యం..భవిష్యత్ లోకి చూస్తే క్రిప్టో, వెబ్3 పరిశ్రమ కీలకమైన పరివర్తన కోసం సిద్ధంగా ఉంది. 2025లో అమెరికా ఆధా రిత క్రిప్టో, వెబ్ 3 సంస్థల నుండి ఐపీఓల తరంగం పారదర్శకతను పెంపొందించడం, సంస్థాగత మదుపరులను ఆకర్షించడం ద్వారా ఈ రంగపు ల్యాండ్‌స్కేప్‌ను పునర్నిర్మించాలని భావిస్తోంది. 2000ల ముందు నాటి టెక్ ఐపీఓ బూమ్ మాదిరిగానే, ఈ ఐపీఓలు క్రిప్టోను మరింత ప్రధాన స్రవంతి అసెట్ క్లాస్‌గా ఉంచడం ద్వారా గణ నీయమైన మూలధన ప్రవాహాలను పొందే అవకాశం ఉంది.

ఈ పెట్టుబడుల ప్రవాహం ఈ రంగంలో విశ్వాసా న్ని పెంచడమే కాకుండా మదుపరులకు దీని ఆర్థిక ఆరోగ్యం, వృద్ధి అవకాశాలు, దీర్ఘకాలిక సాధ్యతపై స్పష్టమైన ఇన్ సైట్స్ ను అందిస్తుంది.

## సుజుకి మోటార్స్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకి కన్నుమూత



**న్యూఢిల్లీ-నవభూమి:** సుజుకి మోటార్స్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకి (94) కన్నుమూశారు. గత కొంత కాలంగా ప్రాణాంతక లింఫోమాతో పోరాడుతున్న ఆయన డిసెంబర్ 25న తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు తోషిహిరో సుజుకి తెలిపారు. ఒసాము సుజుకి కోరిక మేరకు సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.

**సంతాప సందేశాలు వద్దు!**

ఒసాము సుజుకి చివరి కోరిక మేరకు ప్రజలు ఎవ్వరూ సంతాపాలు తెలియజేయవద్దని ఆయన కుమారుడు తోషిహిరా సుజుకి కోరారు. తాము కూడా ఎలాంటి సంతాప సభలు నిర్వహించడం లేదని ఆయన స్పష్టం చేశారు. అభిమానులు ఎవ్వరూ పుష్పాలు లేదా పూలదండలు, పరిమళ ద్రవ్యాలు, సంతాపం తెలుపుతూ టెలిగ్రామ్‌లు పంపించవద్దని విజ్ఞప్తి చేశారు.

**గ్రేట్ అచీవ్‌మెంట్**

ఒసాము సుజుకి ఏకంగా 40 ఏళ్లపాటు సుజుకి మోటార్స్ కంపెనీని నడిపించారు. 1958లో సుజుకి మోటార్స్‌లో చేరిన ఆయన 1978లో ప్రెసిడెంట్ అయ్యారు. తరువాత 2000లో కంపెనీ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. 2 పర్యాయాలు కలిపి, ఆయన ఏకంగా 28 ఏళ్లపాటు కంపెనీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ విధంగా ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ కాలం ఓ ఆటోమొబైల్ కంపెనీకి ప్రెసిడెంట్‌గా పనిచేసిన వాడిగా ఒసాము సుజుకి నిలిచారు. 2021లో తన 91 ఏట ఆయన స్వయంగా రిటైర్‌మెంట్ ప్రకటించారు.

వాస్తవానికి 2015 జూన్‌లోనే ఒసాము సుజుకి కంపెనీ అధ్యక్ష బాధ్యతలను తన కుమారుడికి అప్పగించారు. తరువాత ఆయన కంపెనీ ఛైర్మన్‌గా, సీఈఓగా కొనసాగారు. ఒసాము సుజుకి తన పదవీకాలంలో - కాంపాక్ట్ కార్ల తయారీలో సుజుకి మోటార్స్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారు. 1983లో భారతీయ మార్కెట్లోకి ప్రవేశించారు. మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్‌లో అత్యధిక వాటాను కైవసం చేసుకున్నారు. ఇండియా అమ్మే ప్రతి రెండు కార్లలో ఒకటి మారుతి సుజుకిదే కావడం గమనార్హం.

**సుజుకి జీవన ప్రస్థానం**

ఒసాము సుజుకి 1930 జనవరి 30న ఓ వ్యవసాయ కుటుంబంలో నాల్గో సంతానంగా జన్మించారు. జీరో అనే ఊరికి చెందిన ఆయన మొదట్లో రాజకీయ నాయకుడు కావాలని ఆశించారు. ఆయన టోక్యోలోని చువో విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదువుతూనే, జూనియర్ హైస్కూల్‌లో టీచర్‌గా, నైట్ గార్డ్‌గా పార్ట్ టైమ్ జాబ్ చేశారు. డిగ్రీ పూర్తి చేశాక, ఓ బ్యాంక్‌లో పనిచేశారు. తరువాత ఆయనకు షోకో సుజుకితో వివాహం జరిగింది. ఇక్కడే ఆయన జీవితం మేలిమలుపు తిరిగింది. షోకో సుజుకి - స్వయాన సుజుకి మోటార్స్ అధినేతకు మనవరాలు అవుతుంది. ఆయనకు మగవారసులు ఎవరూ లేరు. దీనితో జపనీస్ ఆచారం ప్రకారం, ఒసాము సుజుకి తన భార్య ఇంటిపేరును తీసుకుని ఆటోమొబైల్ వ్యాపారంలోకి ప్రవేశించారు.

## మోసాల్లో బ్యాంకింగ్



**ముంబై-నవభూమి:** బ్యాంకింగ్ మోసాలను అరికట్టడానికి కేంద్రం, రిజర్వు బ్యాంక్ చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన ఈ నివేదిక ఈ విషయాన్ని బట్టబయలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 18,461 బ్యాంకింగ్ మోసాలు జరిగాయని తెలిపింది. వీటి విలువ రూ.21,367 కోట్లని పేర్కొంది. క్రితం ఏడాది జరిగిన మోసాలతో పోలిస్తే భారీగా పెరగగా, అదే విలువ కూడా ఎనిమిది రెట్లు పెరిగిందని ఈ నివేదికలో వెల్లడించింది. బ్యాంకింగ్ రంగ పనితీరు, కమర్షియల్ బ్యాంకులతోపాటు కో-ఆపరేటివ్ బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థల పనితీరు ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో గురువారం ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 18,461 బ్యాంకింగ్ మోసాలు జరిగాయి. వీటి విలువ రూ.21,367 కోట్లు. క్రితం ఏడాది రూ. 2,623 కోట్ల విలువైన 14,480 బ్యాంకింగ్ మోసాలు జరిగాయి. బ్యాంకింగ్ మోసాలు ఆర్థిక వ్యవస్థకు, నిర్వహణ, వ్యాపార రిస్క్, ఆర్థిక స్థిరత్వ చిక్కులతో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ మోసాలు దశాబ్ద కనిష్ఠ స్థాయికి, వీటి విలువ కూడా 16 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాని వెల్లడించింది. ఈ మోసాల్లో అత్యధికంగా ఇంటర్నెట్, కార్డ్ మోసాల వాటా 44.7 శాతంగా ఉన్నదని, మొత్తం విలువలో వీటి వాటా 85.3 శాతంగా ఉన్నదని పేర్కొంది.

**ప్రైవేట్ బ్యాంకుల్లోనే అధికం..**

ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో అత్యధికంగా మోసాలు జరిగాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మోసాల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటా 67.1 శాతంగా నమోదైంది. కానీ, విలువ పరంగా చూస్తే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కార్డ్, ఇంటర్నెట్ మోసాలు అధికంగా జరగడంతో వీటి విలువ అధికంగా ఉన్నది. అలాగే గతేడాది ప్రైవేట్, ప్రభుత్వరంగ బ్యాంకులపై రూ.86.1 కోట్ల మేర జరిమానా విధించారు. డిజిటల్ మోసాల్లో అనేక కేసులు కస్టమర్లపై సోషల్ ఇంజనీరింగ్ దాడుల ఫలితంగా ఉన్నప్పటికీ, అటువంటి మోసాలకు పాల్పడేందుకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించడం కూడా వేగంగా పెరుగుతున్నది.

**పెరిగిన బ్యాంకుల లాభాలు**

బ్యాంకుల లాభాలు మరింత పెరిగాయి. వరుసగా ఆరో ఏడాది 2023-24లోనూ బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ 13 ఏండ్ల కనిష్ఠ స్థాయి 2.7 శాతానికి పడిపోవడంతో లాభాలు అంతకంతకు పెరిగాయని ఆర్బీఐ వెల్లడించింది. ఆర్థిక మూలాలు ధృడంగా ఉండటంతోపాటు బ్యాంకుల పనితీరు మెరుగుపడటం ఇందుకు కారణమని విశ్లేషించింది. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ 32.8 శాతం ఎగబాకి రూ.3,49,6034 కోట్లకు చేరుకున్నాయి. మార్చి 2024 నాటికి దేశవ్యాప్తంగా 12 ప్రభుత్వరంగ బ్యాంకులు ఉండగా, 21 ప్రైవేట్ బ్యాంకులు, 45 విదేశీ బ్యాంకులు, 12 ఎస్ఎఫ్‌బీలు, ఆరు పీబీలు, 43 ఆర్ఆర్‌బీలు, రెండు ఎల్ఏబీలు ఉన్నాయి.

## మన్మోహన్ సింగ్ తెచ్చిన ఒక్క బడ్జెట్‌తో దేశం కష్టాలు మాయం!



**న్యూఢిల్లీ-నవభూమి:** పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న భారత దేశాన్ని గట్టెక్కించిన 1991 కేంద్ర బడ్జెట్‌ను ఒక ల్యాండ్ మార్క్ పద్దుగా పరిగణిస్తారు. దేశ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇదే కావడం గమనార్హం. వాస్తవానికి ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు సొంత పార్టీ నుంచే మన్మోహన్ సింగ్ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఏ మాత్రం తొణకకుండా, తానొక్కరే ఏటికి ఎదురీది - దేశాన్ని ఒడ్డునపడేశారు.

**1991 ఐకానిక్ బడ్జెట్**

దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆధునిక భారత్‌ను మేలిమలుపు తిప్పింది. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు సొంత పార్టీ నుంచి కూడా మన్మోహన్‌కు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం చాలా మంది ఎంపీలకు మింగుడు పడలేదు. కానీ మన్మోహన్ మాత్రం ఆ వ్యతిరేకతను చాలా కూల్‌గా ఎదుర్కొన్నారు.

ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టగానే, ఆర్థికమంత్రిగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 1991 జులై 24న మన్మోహన్ ఈ ల్యాండ్‌మార్క్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ ఆర్థిక సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాయి.

**ఒంటరి పోరాటం**

బడ్జెట్ తర్వాత జర్నలిస్ట్‌లు అడిగిన ప్రశ్నలను కాంగ్రెస్ నేతలు ఎదుర్కోలేకపోయారు. బడ్జెట్ తర్వాత ఎటువంటి షెడ్యూల్ లేకుండానే మన్మోహన్ ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ రాసిన 'టు ది బ్రింక్ అండ్ బ్యాక్: ఇండియా'స్ 1991 స్టోరీ'లో వెల్లడించారు. ఆ విలేకర్ల సమావేశంలో తన బడ్జెట్‌లోని అంశాలను మన్మోహన్ స్పష్టంగా వివరించారు. దానిని బడ్జెట్ విత్ హ్యూమన్ ఫేస్‌గా అభివర్ణించారు. తీవ్ర విమర్శల మధ్య కూడా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ ధరల పెంపును సమర్థించారు. మరోవైపు సొంత పార్టీ నేతల్లో వచ్చిన అసంతృప్తిని నాటి ప్రధాని పీవీ నరసింహారావు గమనించి, ఆగస్టు1న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటుచేశారు. ఎంపీలు తమ ఆగ్రహం, అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కేందుకు అవకాశం ఇచ్చారు. వాటిని మన్మోహన్ నేరుగా ఎదుర్కొని సమాధానం చెప్పేలా నరసింహారావు మౌనంగా ఉన్నారు. ఈ సమావేశం 1991 ఆగస్టు 2, 3 తేదీల్లో సుదీర్ఘంగా కొనసాగింది. మన్మోహన్ సింగ్‌కు కేవలం మణిశంకర్ అయ్యర్, నాథూరామ్ మిర్ధా నుంచి మాత్రమే మద్దతు లభించింది. సభ్యులను శాంతపర్చేందుకు నాడు మన్మోహన్ ఎరువుల ధరలను స్వల్పంగా(40 శాతం నుంచి 30 శాతానికి) తగ్గించారు. ఎల్‌పీజీ, పెట్రోల్ ధరల్లో మాత్రం ఆయన రాజీ పడలేదు.

**దేశ ఆర్థిక ప్రగతే లక్ష్యంగా**

పార్టీ సమావేశాలు ముగియగానే 1991 ఆగస్టు 4, 5 తేదీల్లో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశాలు జరిగాయి. లోక్‌సభలో ఆగస్టు 6న ఆర్థిక మంత్రి చేయాల్సిన ప్రకటనపై ఇందులో చర్చించారు. చివరికి బడ్జెట్ ప్రతిపాదనలను వెనక్కి తీసుకొనే డిమాండ్లను కొట్టిపారేసి, చిన్న రైతుల ప్రయోజనాలు కాపాడటానికి కట్టుబడినట్లు పేర్కొన్నారు. మొత్తం మీద అన్ని పక్షాలను శాంతపరుస్తూనే, ఎరువుల ధరలపై నియంత్రణ తొలగింపును మన్మోహన్ కొనసాగించగలిగారు. వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన జులై నాటికి భారత విదేశీ మారకద్రవ్యం పూర్తిగా అడుగంటింది. దీంతో ఆ నెల ఆర్‌బీఐ తన వద్ద ఉన్న 41 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదవపెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చుకొంది. ఇది కూడా కొన్నాళ్లు మాత్రమే దేశ అవసరాలు తీర్చగలదు. దీంతో పీవీ-మన్మోహన్ జోడీ వ్యతిరేకతను ఎదురీది దేశాన్ని సంక్షోభ సుడిగుండం నుంచి ఒడ్డుకు చేర్చింది.

## జీరో డౌన్‌పేమెంట్‌తో ఎంజీ కార్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటో మొబైల్ సంస్థలు ఆకర్షణీయమైన పథకాలను ప్రవేశపెడుతు న్నాయి. పలు మాడళ్లపై రాయితీలు ప్రకటిస్తున్న సంస్థలు.. దీంట్లోభాగంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా సరికొత్త ప్రణాళికను అందుబాటులోకి తీసుకొచ్చింది.


కంపెనీకి చెందిన ఎంజీ ఆస్టర్, ఎంజీ హెక్టార్‌లను కొనుగోలు చేసిన వారికి జీరో డౌన్‌పేమెంట్‌తో 100 శాతం రుణాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. విడిభాగాలకోసం కూడా రూ.50 వేల వరకు నిధులు కూడా అందించనున్నది. ఈ ఆఫర్ ఈ నెల చివరి వరకు మాత్రమే.

## షాకింగ్.. పరుగులు తీసిన బంగారం, వెండి రేట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** గత కొన్ని రోజులుగా బంగారం వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నిన్న తగ్గిన బంగారం ధరలు, ఈరోజు మాత్రం భారీగా పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో నేడు (డిసెంబర్ 27న) ఉదయం 6.10 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 76,800కి చేరింది. ఇది నిన్నటి ధరలతో పోల్చి చూస్తే 650 రూపాయల పెరగడం విశేషం. ఇదే సమయానికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 70,400 స్థాయికి చేరింది. దీంతోపాటు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,050 స్థాయికి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 70,629కు చేరింది. ఇక వెండి రేట్ల గురించి మాట్లాడితే కిలో వెండి రూ. 400 పెరిగి రూ. 89,760 స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి ధరల గురించి ఇక్కడ తెలుసుకుందాం.





## రష్యా కాల్పుల వల్లే విమానం కూలిపోయిందా?

**మాస్కో-నవభూమి::** అజర్ బైజాన్ విమానం కూలిపోవడానికి పక్షుల గుంపును ఢీకొనడం కారణం కాదా? ఉక్రెయిన్ డ్రోన్ అని భావించి రష్యా మిలిటరీ కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. విమానం వెనుక భాగంలో కనిపిస్తున్న రంధ్రాలు తూటాలు దూసుకెళ్లడంవల్ల పడినవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విమానం కూలిపోవడానికి ముందు లోపల ఒకరు తీసిన వీడియోలో ఓ మహిళ కాలికి గాయమైన దృశ్యాలు, క్యాబిన్ వాల్‌పై కనిపించిన రంధ్రాలు కూడా ఈ సందేహాలకు బలం చేకూరుస్తున్నాయి. అజర్‌బైజాన్ ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. కాగా, రష్యా గగనతల రక్షణ వ్యవస్థ పొరపాటున కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందన్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. దర్యాప్తు పూర్తయితే అసలు కారణాలు తెలుస్తాయని, అప్పటి వరకు ఓపిక పట్టాలని క్రెమ్లిన్ ప్రతినిధి సూచించారు. బుధవారం అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం ఆ దేశ రాజధాని బాకూ నుంచి రష్యాలోని గ్రోజ్నీ నగరానికి వెళ తుండగా కజికిస్థాన్‌లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు సహా 38 మంది ప్రయాణికులు మరణించారు. మిగతా 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. విమానం పక్షులను ఢీకొట్టిన తర్వాత అత్యవసర పరిస్థితి తలెత్తిందని, దాంతో కజికిస్థాన్‌లోని ఆక్టౌ విమానాశ్రయంలో దింపే యత్నంలో కూలిపోయిందనేది ప్రాథమిక సమాచారం.

## రాకాసి సునామీకి 20 ఏళ్లు.. ఆనాటి లక్కీ బేబీ.. ఇప్పుడేం చేస్తున్నాడో తెలుసా..



**న్యూఢిల్లీ-నవభూమి:** వేల మందిని పొట్టనపెట్టుకున్న రాకాసి సునామీ వచ్చి సరిగ్గా 20 ఏళ్లు అవుతోంది. ఇండోనేషియాలో సంభవించిన ఈ సునామీ.. భారత్‌తో పాటూ అనేక దేశాల్లో బీభత్సం సృష్టించింది. అత్యంత ఘోరమైన ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటిగా నిలిచిన ఈ సునామీ నుంచి ఓ చిన్నారి అదృష్టవశాత్తు బయటపడ్డాడు. బేబీ-81గా ప్రపంచానికి పరిచయమైన ఈ బాలుడి కథ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.అది 2004 డిసెంబర్ 26. ఆ రోజు ప్రశాంతంగా నిద్రలేచిన ప్రపంచం.. రాత్రికి మాత్రం భయాందోళనల మధ్య జాగారం చేయాల్సిన పరిస్థితి. ఇండోనేషియాలోని సుమత్రాలో 9.1 తీవ్రతతో సంభవించిన ఈ సునామీ రాకాసి అలలు అనేక దేశాలను చుట్టుముట్టాయి. దీని కారణంగా డజనుకు పైగా దేశాల్లో 2,20,000 కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. ఇండోనేషియాలోనే లక్ష 70 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. శ్రీలంకలో 35 వేల మంది చనిపోయారు.అలాగే ఏపీలో 107 మంది, కేరళలో 177 మంది, తమిళనాడులో 8009 మంది మృత్యువాత పడ్డారు. ఇదిలావుండగా శ్రీలంక తీరంలో ఓ బాలుడు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు. రెండు నెలల వయసున్న జయరస అభిలాష్ అనే బాలుడు.. సునామీ అలలకు కొట్టుకుపోయాడు. తర్వాత పిల్లాడి కోసం కుటుం సభ్యులు ఎంత వెతికినా కనిపించలేదు. మట్టిలో కూరుకుపోయిన ఆ బాలుడు ఆశ్చర్యకంగా ప్రాణాలతో ఉండడాన్ని స్థానికులు కొందరు గమనించారు. వెంటనే బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది ఆ బాలుడికి 81 నంబర్ కేటాయించడంతో అప్పట్లో బేబీ 81గా ప్రపంచానికి తెలిశాడు.

సునామీ బీభత్సంలో తప్పిపోయిన తన కుటుంబం కోసం అప్పట్లో ఈ బాలుడి తండ్రి మురుగుపిళ్లై జయరాసా ఎంతగానే వెతికాడు. ఈ క్రమంలో తన భార్యను కనుక్కున్నా.. చిన్నారిని మాత్రం పసిగట్టలేక పోయాడు. మొదట్లో ఈ బేబీని తీసుకున్న ఓ నర్సు.. ఆ తర్వాత ఆ బాలుడి కుటుంబం గురించి తెలుసుకుని తిరిగి ఇచ్చేసింది. ఆ తర్వాత ఈ చిన్నారి తల్లిదండ్రులు ఎవరనే విషయంపై కోర్టులో కూడా విచారణలు జరిగాయి.

ఎట్టకేలకు డీఎన్ఏ పరీక్షల ద్వారా చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. అప్పటికి ఆ లక్కీ బేబీకి కూడా ప్రస్తుతం 20 ఏళ్ల వచ్చాయి. హైస్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన అభిలాష్.. ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. విశ్వవిద్యాలయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివాలని ఉందని అభిలాష్ చెబుతున్నాడు. సునామీ వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అభిలాష్.. తన తండ్రితో కలిసి అప్పటి రోజులను తెలుసుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## అదృష్టమంటే ఈ బేబీ హిప్పోదే.. క్రిస్మస్ సందర్భంగా రూ.2.5 కోట్ల విరాళం..!




**హైదరాబాద్-నవభూమి:** థాయ్‌లాండ్‌కు చెందిన బేబీ హిప్పో మూ డెంగ్ కు అదృష్టం వరించింది. క్రిస్మస్ సందర్భంగా కెనడాకు చెందిన క్రిప్టోకరెన్సీ బిలియనీర్ విటాలిక్ బుటెరిన్ పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చారు. ఈ బేబీ హిప్పో థాయ్‌లాండ్‌లోని సి రాచా లో గల ఖావో ఖీవ్ ఓపెన్ జూ లో ఉంటుంది. ఈ హిప్పోకి సోషల్ మీడియాలో చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఐదు నెలల వయసు గల ఈ హిప్పో ఇటీవలే మైఖేల్ జాక్సన్ ఫేమస్ డ్యాన్స్ మూన్ వాక్‌తో ఇంటర్నెట్ సన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. మూన్ వాక్ మూమెంట్స్‌తో ఈ హిప్పో అదరగొట్టింది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అంతేకాదు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోనూ డొనాల్డ్ ట్రంప్ గెలుస్తారని జోష్యం చెప్పి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలోనే బేబీ హిప్పో దీర్ఘకాలం జీవించేందుకు కెనడాకు చెందిన క్రిప్టోకరెన్సీ బిలియనీర్ భారీ విరాళం ఇచ్చారు. హిప్పో సంరక్షణ కోసం జూ నిర్వాహకులు రూ.2.51 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు న్యూయార్క్ పోస్ట్ నివేదించింది.

## డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగనున్న అమెరికా.. అధికారం చేపట్టిన మొదటి రోజే ట్రంప్ నిర్ణయం?

**వాషింగ్టన్-నవభూమి:** అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన మొదటి రోజే డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారట! ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా తప్పుకునేలా కీలక నిర్ణయం వెలువడుతుందని తెలుస్తున్నది. 'నాకు కచ్చితమైన సమాచారముంది. ఆయన అధికారం చేపట్టిన మొదటి రోజు లేదా పాలన ప్రారంభమైన వెంటనే ఈ నిర్ణయం ఉంటుంది' అని జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన ఆరోగ్య నిపుణుడు లారెన్స్ గోస్టిన్ అన్నట్టు అమెరికా మీడియా కథనాలు చెబుతున్నాయి.

డబ్ల్యూహెచ్‌వోపై మొదట్నుంచీ ట్రంప్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. చైనా జేబు సంస్థగా మారిందని, కొవిడ్-19 సంక్షోభానికి చైనాను దోషిగా నిలబెట్టడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని ట్రంప్ ఆరోపించారు. రెండోసారి అధికారం చేపట్టగానే డబ్ల్యూహెచ్‌వో నుంచి 'అమెరికా ఉపసంహరణ' ఖాయమన్న వార్తలు వెలువడ్డాయి.

## ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్‌ను.. రాజకీయాల్లోకి తీసుకొచ్చిన పీవీ




**హైదరాబాద్-నవభూమి:** భారత ఆర్థిక విధానాలపై మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలతో ఆధునిక ప్రపంచంలో భారత్‌ను ఒక బలమైన ఆర్థిక శక్తిగా నిలబడేలా చేశారు. సమయం వచ్చినప్పుడు ఏ శక్తీ ఆపలేదు. ప్రపంచంలో భారత్ కీలక ఆర్థిక శక్తిగా అవతరించడం అన్నది అలాంటి ఆలోచనే అని నేనీ సభకు చెప్పాలనుకుంటున్నా అంటూ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా తొలి బడ్జెట్ ప్రసంగంలో ఆయన చేసిన వ్యాఖ్యలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఆర్థిక వ్యవస్థను సరళీకరించి భారతదేశం ప్రపంచంలోనే ఆర్థిక సూపర్ పవర్‌గా మారడానికి మార్గం సుగమం చేసిన మన్మోహన్ సింగ్ మన పీవీ నరసింహా రావు చెక్కిన శిల్పమే.

విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ తనదైన ముద్ర వేశారు. ఆర్థిక రంగంలో ఆయన అనుభవం, జ్ఞానంతో ఎన్నో గొప్ప అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. 1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు .. ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థిక మంత్రిని చేశారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేసే కీలక బాధ్యతను అప్పగించారు. ఈ సమయంలోనే దేశంలో ఆర్థిక సంస్కరణలకు, సరళతర విధానాలకు మన్మోహన్ సింగ్ శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.%1992లో పీవీ, మన్మోహన్‌సింగ్ కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే ప్రపంచంలో మన దేశం తలెత్తుకుని నిలబడేలా చేశాయని ఆర్థిక రంగ నిపుణలు చెబుతుంటారు. 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు మన్మోహన్ సింగ్. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు మన్మోహన్ సింగ్. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

దేశంలో పేదవాళ్ల ఆకలి తీర్చేందుకు 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు మన్మోహన్ సింగ్. పాలనలో పారదర్శకతను తీసుకొచ్చేలా.. అధికారులు గుట్టుగా ఉంచే సమాచారాన్ని సామాన్యులు సైతం పొందేందుకు సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు. అలా మన పీవీకి గురువుకు తగ్గ శిష్యుడిగా మన్మోహన్‌సింగ్ పేరు తెచ్చుకున్నారు.

## హడలెత్తిస్తున్న సూపర్‌బగ్స్.. ఎలా ఏర్పడుతాయంటే?





**హైదరాబాద్-నవభూమి:**సూపర్ బగ్స్ పెరుగుతుండటంతో సామాన్యులు చికిత్స కోసం కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిస్తున్నదని ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ వివరాలు అంతర్జాతీయ మెడికల్ జర్నల్ 'బీఎంజే ఓపెన్'లో ప్రచురితమయ్యాయి.

**ఎలా ఏర్పడుతాయి?**

మామూలు జ్వరానికి కూడా విరివిగా యాంటీ బయాటిక్స్‌ను వాడటంతో సాధారణ బ్యాక్టీరియా, వైరస్‌లు కూడా రోగనిరోధకశక్తికి వ్యతిరేకంగా సులభంగా పోరాడగలిగే తర్ఫీదును పొందుతాయి. అప్పుడు చిన్న జ్వరానికి కూడా శక్తిమంతమైన మందులను వాడే పరిస్థితి వస్తుంది. అలాగే, పౌల్ట్రీ సెక్టార్‌లో కోళ్లు త్వరగా బరువు పెరుగడానికి, రోగాలపాలు గాకుండా కొందరు హానికరమైన యాంటీబయాటిక్స్ ఇంజెక్షన్లు వాడుతున్నారు. అలాంటి మాంసాన్ని తినడం కూడా శరీరంలో సూపర్‌బగ్స్ శక్తిమంతంగా మారడానికి దారితీయొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

**ఖర్చులు ఇలా..**

సూపర్‌బగ్స్ కారణంగా సోకే వ్యాధులకయ్యే ఖర్చు మామూలు జ్వరంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. రోగనిరోధకశక్తిని పెంచడానికి శక్తిమంతమైన కొత్త మందులను ఇవ్వడంతో పాటు ఐసీయూలో చికిత్సనందించడమే దీనికి కారణంగా చెప్తున్నారు. సూపర్‌బగ్స్ చికిత్సకు దేశంలోని ఒక్కో ప్రైవేటు దవాఖానలో రూ. 3 లక్షల వరకు ఖర్చు పెట్టే సందర్భాలు కూడా ఉన్నట్టు వెల్లడించారు. దవాఖాన ఖర్చుల కోసం కొందరు తమ పొదుపు ఖాతాల్లోని డబ్బును వినియోగిస్తే, మరికొందరు అప్పులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంకొందరు స్థిర, చరాస్తులను తాకట్టు పెడుతున్నారని, మరికొందరు తమ దైనందిన అవసరాలను, ఆహారాన్ని తగ్గించుకొంటున్నట్టు తెలిపారు.

## రష్యా క్షిపణి వల్లే విమానం కూలిందా.. కజకిస్థాన్ దుర్ఘటనపై అనుమానాలు?



**మాస్కో-నవభూమి:**అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం నైరుతి కజకిస్థాన్‌లో బుధవారం కూలిపోవడానికి కారణం రష్యా క్షిపణి అయి ఉండవచ్చునని బ్రిటన్‌లోని స్వతంత్ర సంస్థ ఓస్ప్రే ఫ్లైట్ సొల్యూషన్స్ చెప్పింది. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించిన క్షిపణి కారణంగానే ఈ విమానం కూలిపోయి ఉండవచ్చునని తెలిపింది. ఈ సంస్థ చీఫ్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ మట్ బోరీ మాట్లాడుతూ, ఈ విమానం శిథిలాలకు సంబంధించిన వీడియోను పరిశీలించినపుడు విధ్వంసక చర్య జరిగినట్లు సంకేతాలు వస్తున్నాయన్నారు.

రష్యాలోని స్వతంత్ర మీడియా సంస్థ మెడుజ కూడా ఇదే అనుమానం వ్యక్తం చేసింది. ఉపరితలం నుంచి ప్రయోగించిన క్షిపణి ప్రభావం ఈ విమానం తోక భాగంపై పడినట్లు కనిపిస్తున్నదని పేర్కొంది.

## హెచ్1బీ పరిమితి తొలగింపు? డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ముందు ప్రతిపాదన




**వాషింగ్టన్-నవభూమి:** విదేశీ నిపుణులు అమెరికా ఉద్యోగం చేసేందుకు అవకాశం కల్పించే హెచ్1బీ వీసాలపై అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. ఈ వీసాలపై ఇప్పటివరకు ఉన్న కంట్రీ క్యాప్‌ను తొలగించే అవకాశాలు ఉన్నాయి. ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలు కఠినతరం అవుతాయని, అమెరికా వీసాలు దక్కడం మరింత కష్టమవుతుందనే అంచనాలకు భిన్నంగా ఈ నిర్ణయం ఉండే అవకాశం ఉంది.

**కంట్రీ క్యాప్ తొలగిస్తే..**

ఏదైనా రంగంలో నిపుణులైన ఇతర దేశాల వారు అమెరికాలోని కంపెనీల్లో ఆరేండ్ల పాటు పని చేసుకునేందుకు వీలుగా హెచ్1బీ వీసాలు ఇస్తారు. అయితే, ఈ వీసాలపై పరిమితి ఉంది. మొత్తం వీసాల్లో 7 శాతానికి మించి ఏ దేశానికి ఇవ్వొద్దని అమెరికా గతంలో 'కంట్రీ క్యాప్' విధించింది. దీంతో హెచ్1బీ వీసాలకు ఎక్కువగా పోటీ పడే దేశాల వారు ఏండ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. జనాభా, పోటీ తక్కువగా ఉండే దేశాల వారికి ఎలాంటి వెయిటింగ్ లేకుండా వేగంగా ఈ వీసాలు వస్తున్నాయి. ఇప్పుడు కంట్రీ క్యాప్ తొలగిస్తే.. దేశంతో సంబంధం లేకుండా హెచ్1బీ వీసాలు జారీ అవుతాయి. పోటీ ఎక్కువగా ఉన్న దేశస్థులకు ఎక్కువ హెచ్1బీ వీసాలు దక్కుతాయి.


**భారతీయులకు ఎక్కువ మేలు**

హెచ్1బీ వీసాలపై పరిమితి తొలగిస్తే భారతీయ నిపుణులకు ఎక్కువ మేలు జరగనుంది. టెక్నాలజీ, ఐటీ, ఇంజినీరింగ్, ఆరోగ్య రంగాల నిపుణులకు అమెరికా ఎక్కువగా ఈ వీసాలు ఇస్తుంది. టెక్, ఐటీ, ఇంజినీరింగ్ నిపుణుల సంఖ్య భారత్‌లో ఎక్కువ.

**భారత అమెరికన్ శ్రీరామ్ కృష్ణన్ ప్రతిపాదన**

హెచ్1బీ వీసాలపై కంట్రీ క్యాప్‌ను తొలగించాలనే ప్రతిపాదనను భారత అమెరికన్ శ్రీరామ్ కృష్ణన్ తెరపైకి తెచ్చారని తెలుస్తున్నది.ట్రంప్ గెలిచాక ఆయనను కీలకమైన సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యాలయంలో ఏఐ పాలసీ సలహాదారుగా నియమించారు. ఇమిగ్రేషన్ విధానంలో ప్రతిభకు పెద్దపీట వేయాలని, ప్రతిభ ఆధారంగా వీసాల కేటాయింపు ఉండాలని ఆయన సూచించారు.

## వరల్డ్ ఫేమస్ యూనివర్సిటీల్లో చదువు- మన్మోహన్ సింగ్ కుమార్తెలు ఇప్పుడు ఏం చేస్తున్నారంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒక గొప్ప ఆర్థికవేత్త, అపర మేధావి, ఆర్థిక సంస్కర్తగా అందరికీ తెలుసు. నిరాడంబరంగా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. 'నేను మసకగా ఉన్న కిరోసిన్ దీపం వెలుగులో చదువుకున్నాను. నేను ఇప్పుడు ఇలా ఉన్నానంటే కారణం నా చదువే' అని గతంలో ఓ సందర్భంలో చెప్పారు మన్మోహన్. అందుకే ఆయన వ్యక్తిగత జీవితం ప్రస్తావన వస్తే అందులో ముఖ్యంగా చర్చించుకునేది ఆయన చదువు గురించే. విద్య పట్ల మన్మోహన్ సింగ్‌కు ఉన్న శ్రద్ధ ఆయన పిల్లల విజయాల్లో కనిపిస్తుంది. మన్మోహన్ ముగ్గురు కుమార్తెలు ఉపిందర్ సింగ్, అమృత్ సింగ్, దామన్ సింగ్ తండ్రి బాటల్లోనే నడిచారు. ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుకుని వారి కెరీర్లలో అద్భుత విజయాలు సాధించారు. అనేక మైలురాళ్లు దాటారు. వీరు సాధించిన విజయాలు ఏంటి? ఇప్పుడు ఏం చేస్తున్నారో ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఉపిందర్ సింగ్**

ఉపిందర్ సింగ్ ఒక చరిత్రకారిణి. అశోక విశ్వవిద్యాలయంలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు ఉపిందర్ సింగ్ దిల్లీ యూనివర్సిటీలో చరిత్ర విభాగం అధిపతిగా పనిచేశారు. ఆమె దిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, మాంట్రియాల్‌లోని మెక్‌గిల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశారు. హార్వర్డ్, కేంబ్రిడ్జ్, లైడెన్ యూనివర్సిటీల్లో ఉపిందర్ సింగ్‌కు ఫెలోషిప్‌లు ఉన్నాయి. 2009లో ఆమెకు సోషల్ సైన్సెస్ విభాగంలో ఇన్ఫోసిస్ బహుమతి లభించింది.

ఉపిందర్ సింగ్ ప్రాచీన భారతీయ చరిత్ర, పురావస్తు శాస్త్రం, రాజకీయ సిద్ధాంతాలపై చాలా పరిశోధనలు చేశారు. అంతేకాకుండా భారతదేశ చరిత్ర, రాజకీయాల గురించి అనేక పుస్తకాలు రచించారు. ఉపిందర్ సింగ్ రాసిన పుస్తకాలలో "ఏ హిస్టరీ ఆఫ్ ఏన్షియంట్ అండ్ ఎర్లీ మెడీవల్ ఇండియా", "పొలిటికల్ వాయ్?లెన్స్ ఇన్ ఏన్షియంట్ ఇండియా" వంటివి పుస్తకాలు ప్రశంసలు పొందాయి.

**అమృత్ సింగ్**


అమృత్ సింగ్ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది. స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్‌లో ప్రాక్టీస్ ఆఫ్ లా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా రూల్ ఆఫ్ లా ఇంపాక్ట్ ల్యాబ్‌కు వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూడా వ్యవహరించారు. అమృత్ సింగ్- యేల్ లా స్కూల్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీల నుంచి డిగ్రీ పట్టాలు అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా క్లిష్టమైన మానవహక్కుల కేసులకు ప్రాతినిధ్యం వహించారు. హింస, ఏకపక్ష నిర్బంధ పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడటం అందులో ఒకటి.

యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్, ఆఫ్రికన్ కమిషన్ ఆన్ హ్యూమన్ అండ్ పీపుల్స్ రైట్స్‌తో కూడా అమృత్ సింగ్ పనిచేశారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై ఆమె చేసిన రచనలు ది న్యూయార్క్ టైమ్స్, ది గార్డియన్ వంటి ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్లలో ప్రచురితమయ్యాయి.

**దమన్ సింగ్**

వ్యక్తిగత, విశ్లేషణాత్మక రచనలకు ప్రసిద్ధి చెందిన నిష్ణాత రచయిత దమన్ సింగ్. 1963లో చండీగఢ్‌లో జన్మించిన దమన్ సింగ్‌ను తండ్రి మన్మోహన్ సాంస్కృతిక, మేధో సంపత్తి వారసురాలిగా చూడొచ్చు. తన తల్లిదండ్రుల వ్యక్తిగత జీవితం ఆధారంగా "స్ట్రిక్ట్లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గురుశరణ్" అనే పుస్తకం రాశారు దమన్ సింగ్. "ది సేక్రెడ్ గ్రోవ్", "నైన్ బై నైన్" వంటి ఆమె ఇతర రచనలు- స్టోరీ టెల్లర్‌గా ఆమె బహుముఖ ప్రజ్ఞను ప్రతిబింబిస్తాయి.

## కేంద్ర మంత్రి సన్నిహితుడిపై ఈడీ ఫోకస్



**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర మంత్రి, లోక్ జన శక్తి (రామ్ విలాస్ పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్‌కు అత్యంత సన్నిహితుడైన హులాస్ పాండే నివాసం, సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. అందులోభాగంగా పాట్నా, బెంగళూరు, న్యూఢిల్లీలో సోదాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్థిక అవకతవకలు నేపథ్యంలో ఈ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

అయితే ఈడీ మాత్రం ఎందుకోసం ఈ సోదాలు చేపట్టిందనే విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. ఈ రోజు ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు.. ఇంకా కొనసాగుతోన్నాయి. మూడు నగరాల్లోని ఆయనకు చెందని సంస్థల్లోని పత్రాలను ఈడీ అధికారులు క్షణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు అత్యంత సన్నిహితుడుగా కొనసాగుతోన్న హులాస్ పాండేపై ఈడీ దాడులు చేసి సోదాలు చేపట్టడంతో.. బిహార్‌లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఇక 2012లో ప్రైవేట్ మిలటరీ రణవీర్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మేశ్వర్ సింగ్ ముఖియా హత్య కేసులో హులాస్ పాండేపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సీబీఐ ఆయనపై ఛార్జి షీట్ దాఖలు చేసింది. దీంతో 2023 డిసెంబర్‌లో పార్టీ పార్లమెంటరీ బోర్డ్ చైర్మన్ పదవికి పాండే రాజీనామా చేశారు. అంతేకాకుండా.. ఈ హత్య కేసులో తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండిచారు. ఇది రాజకీయ కుట్రలో భాగమని పాండే ఆరోపించారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో సీబీఐ చార్జిషీట్‌ను ప్రత్యేక న్యాయస్థానం కొట్టి వేసింది. దీంతో ఈ హత్య కేసులో పాండేకు ఉపశమనం లభించినట్లు అయింది.

2012, జూన్ 1వ తేదీన బిహార్‌లోని బోజ్‌పూర్ జిల్లాలో రణవీర్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మేశ్వర్ సింగ్ ముఖియాను ఆగంతకులు కాల్చి చంపారు. బిహార్‌లోని పలు జిల్లాల్లో అగ్రవర్ణ రైతుల్లో ఉన్న రాజకీయ ప్రాబల్యం బ్రహ్మేశ్వర్ సింగ్ వల్ల పోతుందనే భయంతో ఆయన హత్యకు పాండే కుట్ర పన్నారంటూ సీబీఐ తన ఛార్జ్ షిట్‌లో పేర్కొంది.మరోవైపు మాజీ ఎమ్మెల్సీ పాండే.. లోక్‌జన శక్తి పార్టీలో చేరక ముందు బిహార్ సీఎం, జనతాదళ్ (యు) అధినేత నితీష్ కుమార్ పార్టీలో సభ్యుడిగా కొనసాగిన సంగతి తెలిసిందే.

ఇంకోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు 2025 ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మరోసారి జేడీ (యూ) అధినేత నీతిష్ కుమార్ పాలన పగ్గాలు చేపడతారంటూ.. ఆ పార్టీ అగ్రనేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## పాక్ సరిహద్దుల వైపు 15 వేల మంది తాలిబన్ ఫైటర్లు!

**ఇస్లామాబాద్:-నవభూమి:** 'మీ పెరట్లో పాములను పెంచుతూ, పొరుగువారిని మాత్రమే అవి కాటేయాలని ఎంతమాత్రం ఆశించకండి. ఎందుకంటే వాటికి పాలుపోసి పెంచుతున్న మిమ్మల్ని కూడా ఆ సర్పాలు అంతిమంగా కాటేస్తాయి' అని పాకిస్థాన్‌ను ఉద్దేశించి 2011లో అప్పటి యూఎస్ సెక్రటరీ హిల్లరీ క్లింటన్ వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యలను నిజం చేస్తూ ఇన్నాళ్లు తాము పెంచి పోషించిన అఫ్గానిస్థాన్ తాలిబన్లు ఇప్పుడు పాకిస్థాన్‌పై దండెత్తి వస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



నవచిత్ర



## మనం చేయగలం.. ట్రెండింగ్‌లో సమంత మార్నింగ్ మోటివేషన్

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.





పూనమ్

## మాకేం సమస్యలు ఉండవన్న పూనమ్.. రేవంత్ తో మీటింగ్ పై సెటైర్!


నటి పూనమ్ కౌర్.. ఎప్పటికప్పుడు సోషల్ మీడియా పోస్టులతో ట్రెండింగ్ లో ఉంటారన్న విషయం తెలిసిందే. పలు సమస్యలు, సామాజిక అంశాలపై ఆమె తన గొంతు వినిపిస్తుంటారు. తన కామెంట్స్ తో వైరల్ అవుతుంటారు ఒక్కోసారి ఆమె ట్వీట్స్ వివాదాస్పదంగా మారుతుంటాయి. తాజాగా ఎక్స్ లో మరో పోస్ట్ పెట్టారు పూనమ్ కౌర్. మహిళలెవరూ సీఎం సమావేశానికి వెళ్లేంత ముఖ్యమైన వ్యక్తులుగా పరిగణించబడలేదని పూనమ్ కౌర్ అన్నారు. ఎందుకంటే మహిళలకు ఎలాంటి సమస్యలు ఉండవని వ్యంగ్యంగా మాట్లాడారు. వ్యాపార లేదా ఇతర విషయాల్లో హీరోలకు సమస్యలు వచ్చినప్పుడు ఇండస్ట్రీ అంతా సపోర్ట్ గా నిలబడుతుందని పూనమ్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో మహిళకు ఒక్క సమస్య కూడా ఉండదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అయితే పూనమ్ కౌర్ పోస్ట్.. నిన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ ప్రముఖులు జరిపిన భేటీని ఉద్దేశించినదేనని క్లియర్ గా తెలుస్తుంది. దీంతో ఆమె పోస్ట్ వైరల్ గా మారగా.. ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. తమ అభిప్రాయాలు చెబుతున్నారు. అయితే ఇన్ స్టా స్టోరీలో సీఎం రేవంత్ రెడ్డి పేరును ప్రస్తావించారు పూనమ్. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన సామాన్య మహిళ రేవతి గురించి చాలా బాధపడుతున్నారని అన్నారు. కానీ మీటింగ్ లో ఒక్క మహిళ కూడా లేరేంటని అడగలేకపోయారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు పూనమ్ పోస్టులు వైరల్ అయ్యాయి. ఇక నిన్న హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉన్న పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రితో టాలీవుడ్ కు చెందిన సుమారు 50 ప్రముఖులు భేటీ అయిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ముందు సినీ పెద్దలు.. కొన్ని కీలకమైన ప్రతిపాదనలు ఉంచగా.. సర్కార్ కూడా కొన్ని ప్రతిపాదనలు ఉంచింది. వివిధ సూచనలు కూడా చేసింది. అయితే ఆ సమావేశానికి హీరోల్లో వెంకటేష్, నాగార్జున, శివ బాలాజీ, కిరణ్ అబ్బవరం, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు వచ్చారు. నిర్మాతల్లో నాగ వంశీ, కేఎల్ నారాయణ, నవీన్, రవిశంకర్, దానయ్య పలువురు హాజరయ్యారు. దర్శకుల్లో రాఘవేంద్రరావు, త్రివిక్రమ్, కొరటాల శివ, వీర శంకర్ సహ మరికొందరు డైరెక్టర్స్ అటెండ్ అయ్యారు. మహిళా సెలబ్రిటీలెవరూ కనిపించలేదు. ఇప్పుడు ఆ విషయమైనే పూనమ్ స్పందించారు!

## మహేష్ 'ముఫాసా' - తొలి వారం కలెక్షన్ల సునామీ




2019లో విడుదలైన 'ది లయన్ కింగ్' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సారిగా అదే క్రేజ్‌ను కొనసాగిస్తూ డిస్నీ నుండి విడుదలైన 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20, 2024న భారతదేశంలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రం మొదటి వారంలోనే 74 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. ముఖ్యంగా భారతదేశంలో షారుక్ ఖాన్ (హిందీ), మహేశ్ బాబు (తెలుగు), అర్జున్ దాస్ (తమిళం) వంటి ప్రముఖ నటుల వాయిస్ ఓవర్స్ ఈ చిత్రానికి మరింత ఆకర్షణని తెచ్చిపెట్టాయి. హిందీ, తెలుగు, తమిళ భాషలలో కూడా భారీ ప్రేక్షకాదరణను పొందుతూ, అన్ని ప్రాంతాల్లో శక్తివంతమైన కలెక్షన్లను సాధించింది. మొదటి వారంలో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇంగ్లీష్‌లో 26.75 కోట్లు, హిందీ లో 25 కోట్లు, తెలుగు లో 11.2 కోట్లు, తమిళంలో 11.3 కోట్లు సాధించి మొత్తం కలెక్షన్లను 74 కోట్లకు చేరవేసింది. నాటకీయంగా రూపొందించిన కథ, అత్యాధునిక కంప్యూటర్ గ్రాఫిక్స్ తో కూడిన విజువల్స్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఇతర సినిమాలకు గట్టి పోటీగా నిలిచిన 'ముఫాసా: ది లయన్ కింగ్' పీవీఆర్, ఐనాక్స్, సినీపోలిస్ వంటి నేషనల్ థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ముఖ్యంగా ఈ చిత్రానికి దేశవ్యాప్తంగా అన్ని వయసుల ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ కథను బారీ జెంకిన్స రూపొందించారు. ఓ అనాథగా పుట్టిన ముఫాసా, తన స్నేహితులతో కలిసి ప్రైడ్ ల్యాండ్స్ రాజుగా ఎదిగే ప్రయాణాన్ని ఆకర్షణీయంగా చూపించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. లిన్-మాన్యువెల్ మిరాండా అందించిన పాటలు, తర్కసమర్థంగా తెరకెక్కిన స్క్రీన్‌ప్లే చిత్రం విజయవంతంగా నిలబడడానికి ముఖ్య కారణంగా నిలిచాయి. తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో బ్లాక్‌బస్టర్ కలెక్షన్లు సాధిస్తున్న ఈ చిత్రం, కుటుంబ సభ్యులందరితో కలిసి చూడదగ్గ అద్భుత అనుభవంగా నిలుస్తోంది. భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి బ్రహ్మాండమైన ఆదరణ లభించడం విశేషం. సమకాలీన సినిమాలకు ఇది సరికొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, డిస్నీ చిత్రాల ట్రేడ్ మార్క్ సినిమాగా నిలిచింది. ఇకపై వచ్చే వారాల్లో కూడా ఇదే వేగాన్ని కొనసాగిస్తూ, బాక్సాఫీస్ వద్ద మరిన్ని కలెక్షన్స్ ను నమోదు చేయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు అవసరమే: మురళీమోహన్



హీరో అల్లు అర్జున్ కేసు.. తదనంతరం ఇండస్ట్రీలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో టాలీవుడ్ ప్రముఖులు గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇండస్ట్రీ, ప్రభుత్వం కలిసి పని చేయడం గురించే ప్రధానంగా చర్చినట్లుగా ప్రకటించారు. ఇండస్ట్రీ గ్రోత్ ముఖ్యమని.. టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు చిన్న పార్ట్ అని.. అదంత ఇంపార్టెంట్ కాదని దిల్ రాజు చెప్పారు. కానీ సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్ మాత్రం ప్రపంచ స్థాయి సినిమాలు రావాలంటే టికెట్ ధరలు, అదనపు షోలు ఉండాలని అభిప్రాయ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన వారిలో మురళీమోహన్ కూడా ఉన్నారు. మీటింగ్ అయిపోయిన తర్వాత ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీకి ప్రభుత్వం తరపు నుండి ఎలాంటి సహకారం ఉండాలనే దానిపై మురళీ మోహన్ మాట్లాడుతూ.. "ఒకప్పుడు పెద్ద హీరో అయినా చిన్న హీరో అయినా లో బడ్జెట్ లోనే సినిమాలు తీసేవాళ్ళం. అప్పుడు తెలుగు రాష్ట్రంలో మాత్రమే మన సినిమాలు ఆడేవి. ఇతర రాష్ట్రాల్లో మన సినిమాలు ఎక్కడా ఆడేవి కాదు. అందుకే లిమిటెడ్ బడ్జెట్ లో సినిమాలు చేసాం. కానీ ఇవాళ తెలుగు సినిమా జాతీయ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. అనేక దేశాల్లో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా రిలీజ్ అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్ విపరీతంగా పెరుగుతోంది" అని అన్నారు. "పెద్ద బడ్జెట్ తో సినిమాలు తీయాల్సి వస్తోంది. ఇతర దేశాల సినిమాలతో మన సినిమాలు కూడా పోటీగా నిలబడాలంటే, బాగా ఖర్చు పెట్టి తీయాలనే ఉద్దేశంతో బడ్జెట్ ఎక్కువ పెడుతున్నారు. సినిమా రిలీజైన మొదటి వారంలో ఎంత కలెక్షన్స్ వస్తాయో అదే మెయిన్. ఆ తర్వాత అంత ఎక్కువ వసూళ్లు రావు. అందుకే వారం రోజుల పాటు టికెట్ రేట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలి. అదనంగా ఎక్కువ షోలు వేసుకోడానికి అవకాశం కల్పించాలి. అప్పుడే ఫస్ట్ వీక్ లో మేజర్ కలెక్షన్స్ రాబట్టుకోడానికి అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని సీఎంకు విన్నవించాం. అనేక ఇతర దేశాల్లో కూడా టికెట్ రేట్లు పెంచడం, షోల సంఖ్య పెంచడం అనేది ఉంది. అదే ఇక్కడ కొనసాగించాలని కోరితే, సానుకూలంగా స్పందించారు. 'సినీ ఇండస్ట్రీ తరపున ఓ కమిటీ ఏర్పాటు చేయండి. తరచూ కలుసుకుందాం. మినిస్టర్ తో, ఎఫ్డీసీ చైర్మన్ తో కూర్చొని మీరు డిసైడ్ చేయండి. ఆ తర్వాత నా దగ్గరకు వస్తే ఫైనల్ డెసిజన్ తీసుకుందాం' అని ముఖ్యమంత్రి చెప్పారు" అని మురళీ మోహన్ చెప్పారు. అలానే ప్రభుత్వం, సినీ ఇండస్ట్రీ మధ్య కమ్యునికేషన్ గ్యాప్ ఏర్పడిందనే అంశం మీద మురళీ మోహన్ స్పందిస్తూ.. "నేను ముఖ్యమంత్రికి ఓ విషయం విన్నపించాను. 'ఎలక్షన్ రిజల్ట్స్ రోజు పొలిటీషియన్స్ అందరూ మనం గెలుస్తామా లేదా, అధికారంలోకి వస్తామా రామా? అని ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తారు. అదే విధంగా సినిమా వాళ్లం కూడా కొన్ని వందల కోట్లు ఖర్చు పెట్టిన సందర్భంలో జనాల స్పందన తెలుసుకోడానికి ఫస్ట్ షోకి వెళ్తాము. ఎందుకంటే మార్నింగ్ షోకే సినిమా హిట్టా? ఫట్టా? అనేది ప్రజలు తేల్చేస్తారు' అని చెప్పాను. గతంలో మేం కూడా అలానే థియేటర్లకు వెళ్లేవాళ్లం. 'పుష్ప 2' షో చూడటానికి అల్లు అర్జున్ కూడా వెళ్లారు. దురదృష్టవశాత్తూ అనుకోకుండా అలాంటి ఇన్సిడెంట్ జరిగింది. ఓ మహిళ మృతి చెందడం, వాళ్ళ అబ్బాయి స్పృహ లేకుండా పడిపోవడం ఎవరూ ఊహించింది కాదు. దానికి సినీ ఇండస్ట్రీలో అందరం చింతిస్తున్నాం. ఫ్యూచర్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా మా సైడ్ నుంచి మేం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటాం. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి పోలీస్ డిపార్ట్మెంట్ నుంచి సహకారం కూడా అందజేస్తే ఇలాంటివి జరగకుండా చూస్తామని సీఎంకు విన్నవించాం. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## దుల్కర్ ఖాతాలో మరో హిట్టు బొమ్మ అవుతుందా..?



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ సొంత భాషలో కన్నా టాలీవుడ్‌లో తన సత్తా చాటుతున్నాడు. మహానటిలో జెమిని గణేశన్ పాత్ర చేసిన దుల్కర్ ఆ సినిమాతో సూపర్ హిట్ అందుకోగా ఆ తర్వాత సీతారామం తో సోలో హిట్ అందుకున్నాడు. అదేంటో సీతారామం సినిమా చూశాక ఈ కథ దుల్కర్ కోసమే అన్నట్టు అనిపించింది. ఆ తర్వాత చాలా కథలు వచ్చినా మళ్లీ లక్కీ భాస్కర్ తోనే దుల్కర్ మరో హిట్ అందుకున్నాడు. లక్కీ భాస్కర్ సినిమా రిలీజ్ వరకు పెద్దగా బజ్ రాలేదు కానీ సినిమా చూసిన ఆడియన్స్ థ్రిల్ అవ్వడంతో సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చి బ్లాక్ బస్టర్ అందుకుంది. దుల్కర్ నెక్స్ట్ సినిమా ఏది అవుతుంది అన్న చర్చ జరుగుతుండగా ఈలోగా కాంతా అంటూ ఒక పీరియాడికల్ మూవీతో రాబోతున్నాడు. ఐతే ఇది స్ట్రైట్ తెలుగు సినిమా కాదు. తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న తెలుగు, తమిళ బైలింగ్వల్ మూవీ. ఈ సినిమా కథ 1950 బ్యాక్ డ్రాప్ లో ఉంటుందని తెలుస్తుంది. థ్రిల్లర్ నేపథ్యంతో ఈ సినిమా వస్తుందని టాక్. సినిమాలో మిస్టర్ బచ్చన్ హీరోయిన్ భాగ్య శ్రీ బోర్స్ నటిస్తుంది. సాధారణంగా కథ నచ్చితేనే దుల్కర్ సినిమా కమిట్ అవుతాడు. లక్కీ భాస్కర్ సినిమా చూశాక దుల్కర్ కథల విషయంలో తను ఎలా ఆలోచిస్తాడన్నది అర్థమైంది. అందుకే దుల్కర్ పిక్ చేశాడు అంటే కచ్చితంగా కథలో కానీ, కథనంలో కానీ ఆడియన్స్ ని మెప్పించే పాయింట్ ఉంటుందని ఫిక్స్ అవుతున్నారు. కాంతా సినిమాలో కూడా అలాంటి మ్యాజిక్ ఉంటుందని చెప్పొచ్చు. ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా రానా సహ నిర్మాతగా ఉంటున్నాడు. రానా కూడా కంటెంట్ ఉన్న సినిమాలకు తన సపోర్ట్ అందిస్తాడు. సో తెలుగు రిలీజ్ విషయంలో రానా బాధ్యత మీద వేసుకుంటాడని తెలుస్తుంది. ఎలాగు దుల్కర్‌కి తెలుగు మార్కెట్ బాగుంది కాబట్టి కాంతా సినిమాకు బీభత్సమైన బిజినెస్ జరిగే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. కచ్చితంగా దుల్కర్ అంచనా ప్రకారం ఈ కాంతా కూడా మరో సూపర్ హిట్ బొమ్మ అవుతుందని అనుకుంటున్నారు. కాంతా సినిమా విషయంలో ఆడియన్స్ కూడా సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు. మరి ఈ సినిమా ఎలాంటి హంగామా చేస్తుందో చూడాలి. దుల్కర్ సినిమా అప్డేట్స్ తో సౌత్ ఫ్యాన్స్ అంతా కూడా ఖుషి అవుతున్నారు.

## మన్మోహన్ సింగ్‌కు టీమ్‌ఇండియా ఘన నివాళి.. నల్ల బ్యాండ్‌లతో బరిలోకి



**న్యూఢిల్లీ- నవభూమి:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు మాజీ ప్రధాని మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మెల్‌బోర్న్‌లో ఉన్న భారత క్రికెట్ జట్టు సైతం మన్మోహన్‌కు నివాళు లర్పించింది. ఆయన గౌరవార్థం మెల్‌బోర్న్ టెస్ట్‌లో రెండో రోజు టీమ్ ఇండియా ఆటగాళ్లంతా చేతికి నల్లబ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. ఈ మేరకు ఆటగాళ్లు నల్ల బ్యాండ్‌లతో ఉన్న ఫొటోలను బీసీసీఐ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ రెండో రోజు టీమ్ ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. ఓపెనర్ జైశ్వాల్ ఆఫ్ సెంచరీ చేశారు. ఆస్ట్రేలియా 474 రన్స్‌కు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది.

## జైస్వాల్, కోహ్లీ, ఆకాశ్ ఔట్.. ఇండియా 164/5



**న్యూఢిల్లీ- నవభూమి:** మెల్‌బోర్న్ టెస్టు రెండో రోజు మూడవ సెషన్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. ఆఖరి క్షణాల్లో వరుసగా ఇండియా మూడు వికెట్లను కోల్పోయింది. హాఫ్ సెంచరీ చేసిన జైస్వాల్ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత బోలాండ్ బౌలింగ్‌లో కోహ్లీ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 153 రన్స్‌కు రెండు వికెట్లు కోల్పోయి.. స్థిరంగా ఆడుతున్నట్లు కనిపించిన ఇండియా అకస్మాత్తుగా మరో రెండు వికెట్లను చేజార్చుకున్నది. నైట్‌వాచ్‌మెన్‌గా వచ్చిన ఆకాశ్ దీప్ కూడా పెవిలియన్ బాటపట్టాడు. 13 బంతులు ఆడిన అతను డకౌట్ అయ్యాడు. ప్రస్తుతం పంత్, జడేజా క్రీజ్‌లో ఉన్నారు.

మూడవ వికెట్‌కు కోహ్లీ, జైస్వాల్ మధ్య 102 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది. జైస్వాల్ రనౌట్ అయిన కొన్ని బంతుల తేడాలోనే కోహ్లీ ఔటయ్యాడు. జైస్వాల్ 82, కోహ్లీ 36 రన్స్ చేసి నిష్క్రమించారు. నైట్‌వాచ్‌మెన్ ఆకాశ్ దీప్ డకౌట్ అయ్యాడు. బోలాండ్ అతన్ని ఔట్ చేశాడు. టీ బ్రేక్‌కు ముందు రాహుల్, రోహిత్ ఔటయ్యారు. ఆస్ట్రేలియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 474 రన్స్ స్కోర్ చేసిన విషయం తెలిసిందే. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి.. ఇండియా 5 వికెట్ల నష్టానికి 164 రన్స్ చేసింది. పంత్ 6, జడేజా 4 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.

నవక్రీడ

## జైస్వాల్ 9వ హాఫ్ సెంచరీ



**న్యూఢిల్లీ- నవభూమి:** యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ కొట్టాడు. మెల్‌బోర్న్ టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో అతను నిలకడగా ఆడుతున్నాడు. టెస్టుల్లో 9వ హాఫ్ సెంచరీ నమోదు చేశాడతను. 81బంతుల్లో జైస్వాల్ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. మూడవ సెషన్‌లో కోహ్లీ, జైస్వాల్ ఆచితూచి ఆడుతున్నారు. కోహ్లీ కూడా నెమ్మదిగా స్కోరింగ్ చేస్తున్నాడు. ఆ ఇద్దరూ మూడో వికెట్‌కు ఇప్పటి వరకు 79 రన్స్ జోడించారు. తాజా సమాచారం ప్రకారం ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 130 రన్స్ చేసింది. జైస్వాల్ 65, కోహ్లీ 30 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**